


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 18-03-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 160 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# అన్ని హంగులతో కౌన్సిల్ హాల్ సిద్ధం

- మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లలో ఏ లోపం ఉండరాదని అధికారులకు ఆదేశం
- జి.వి.యం.సి.లో ఏర్పాట్లను పర్యవేక్షించిన

-జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్





విశాఖపట్నం : అన్ని హంగులతో కౌన్సిల్ హాలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధారిటి వి. వినయ్ చంద్ పేర్కొన్నారు. గురువారం మహా విశాఖ నగర పాలక సంస్థ కార్యాలయంలోని 2వ అంతస్తులోని కౌన్సిల్ హాలులో చేస్తున్న ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లలో ఏ లోపం ఉండరాదని అధికా రులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్స్ ఆఫీసియో సభ్యులు, ఎన్నికైన వార్డు సభ్యులు హాజరు అవుతారని చెప్పారు. ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సభ్యులంతా ఉదయం గం.10.30 ని.లకే చేరుకోవా లన్నారు. మేయర్ అభ్యర్థికి గుర్తింపు పొందిన పార్టీ సభ్యులు వివిధ ఫారాలు ద్వారా ప్రతిపాదనలు అంద జేయా లని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జివియంసి కమీషనర్ నాగలక్ష్మి , విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి పెంచల కిషోర్, అదనపు కమీషనర్లు ఆశాజ్యోతి, రమణి, చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# టెస్ట్‌లు.. టీకా కేంద్రాలు పెంచండి

- కరోనా కట్టడికి మైక్రో కంటైన్‌మెంట్ జోన్‌లపై దృష్టిపెట్టాలని సీఎంలకు సూచన

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైయస్.జగన్



దిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు మళ్లీ విజృంభిస్తుండటంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. మహారాష్ట్రలో సెకెండ్ వేవ్ మొదలైందన్న వార్తల నేపథ్యంలో వైరస్ కట్టడికి అవసరమైన చోట్ల మైక్రో కంటైన్‌మెంట్ జోన్‌లు ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. బుధవారం ఆయన పలు రాష్ట్రాల సీఎంలతో దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. కరోనా నియంత్రణ, వ్యాక్సినేషన్ తదితర అంశాలపై సీఎంలతో చర్చించారు. కరోనా రెండో దశకు చేరకుండా సత్వర, నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలన్నారు. కరోనా పరీక్షలు, వ్యాక్సిన్ కేంద్రాలు పెంచాలని సూచించారు. కరోనాపై పోరాటం ద్వారా భారత్ సాధించిన ఆత్మవిశ్వాసం.. నిర్లక్ష్యానికి దారితీయరాదన్నారు. ప్రజలు ఆందోళన, భయానికి గురయ్యేలా కాకుండా ముందు జాగ్రత్త చర్యలతో వారి ఇబ్బందులు తొలగించాలని దిశానిర్దేశం చేశారు. ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 10శాతం టీకాలు వృథా అయ్యాయన్న ఆయన.. దీనిపై సమీక్షించుకోవాలన్నారు. కేసుల పెరుగుదలకు ఇప్పుడే అడ్డుకట్ట వేయకపోతే ఈ మహమ్మారి దేశమంతా వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అనేక దేశాల్లో కొత్త కేసులు పెరుగుతున్నాయన్న మోదీ.. కరోనా మరణాలు అతి తక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటని చెప్పారు. దేశంలో

తరువాయి 2లో..



# వలస కార్మికుల కోసం నగరాల్లో అద్దె ఇళ్ళ సముదాయాలు

- రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



న్యూఢిల్లీ : వలస కార్మికులు, అల్పాదాయ వర్గాలు, నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం అద్దె ఇళ్ళ సముదాయాలు నిర్మించే పథకాన్ని ప్రారంభించినట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి బుధవారం రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ కార్మికులతోపాటు వీధుల్లో విక్రయాలు జరిపేవారు, రిక్షా కార్మికులు, సేవ రంగంలో పని చేసే కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, మార్కెట్లు, వాణిజ్య సంస్థల్లు, విద్యా, ఆరోగ్య, హెూటల్ రంగాలలో పని చేస్తున్న వారంతా ఈ పథకం కింద లబ్ది పొందుతారని చెప్పారు.

అద్దె ఇళ్ళ సముదాయాల్లో నివసించే కార్మికులకు వాటిని నిర్వహించే యజమానులకు మధ్య కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఒప్పందం చేసుకోవలసి ఉంటుందని మంత్రి తెలిపారు. అద్దె గృహ సముదాయలలో వాటి నిర్వహణ బాధ్యతలు చూసే ఏజెన్సీ షరతుల మేరకు వసతి అలాట్‌మెంట్ జరుగుతుంది. అద్దె గృహ సముదాయాలు నిర్మించే కంపెనీ స్థానిక పరిశ్రమలు, సర్వీసు ప్రొవైడర్లు, ఇతర సంస్థలతో ఒప్పందం చేసుకోవలసిందిగా ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు. దీని వలన అద్దె వసూళ్ళలో అవరోధాలు నివారించే అవకాశం ఉంది.

ఉపాధి కోసం పట్టణాలకు వలస వచ్చేకార్మికులు కోసం చౌకగా అద్దె వసతి కల్పించే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకాన్ని రెండు మోడళ్ళుగా చేపట్టనున్నారు. మొదటిది... జేఎన్‌యూఆర్ఎం, రాజీవ్ ఆవాస్ యోజన పథకాల కింద ప్రభుత్వ నిధులతో నిర్మించి సిద్ధంగా ఉన్న నివాసాలను 25 ఏళ్ళపాటు అద్దె గృహ సముదాయాల కింద మార్చడం.

సొంతంగా భూమి కలిగి ఉండి వాటిలో గృహ సముదాయాలు నిర్మించి, నిర్వహించడానికి ఆసక్తి కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం రెండో మోడల్ అని మంత్రి తెలిపారు. రెండో మోడల్ గృహ సముదాయాల నిర్మాణానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన్ - అర్బన్ పథకం కింద నిధులను సమకూర్చనున్నట్లు మంత్రి తెలిపారు.

## పురపాలక పదవుల్లో
# బీసీలకు పెద్దపీట



అమరావతి: పుర పాలక పదవుల్లో సామాజిక సమతుల్యతను దాటి బీసీలకు పెద్దపీట వేశామని వైకాపా ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. మైనార్టీలు, ఎస్సీలకు నిజమైన సాధికారత కల్పించామన్నారు. తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సజ్జల మాట్లాడారు. మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక 70 శాతం వరకు పూర్తయిందన్నారు. ఎంపిక ప్రక్రియ వందశాతం పూర్తికానందునే అభ్యర్థుల జాబితా ప్రకటించలేదని చెప్పారు. మైదుకూరు, తాడిపత్రిలో ఇరు పార్టీలు సమంగా నిలిస్తే టాస్ ద్వారా ఛైర్మన్ ఎన్నిక చేపడతారన్నారు. ఇతరులను ప్రలోభపెట్టొద్దని.. అధికార దుర్వియోగం చేయొద్దని సీఎం ఆదేశించినట్లు సజ్జల వెల్లడించారు.

## నారాయణ నివాసంలో
# సీఐడీ సోదాలు




నెల్లూరు: తెదేపా సీనియర్‌నేత, మాజీ మంత్రి పి.నారాయణ నివాసంలో సీఐడీ అధికా రులు సోదాలు నిర్వహిస్తున్నారు. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కొనుగోళ్ల , అమ్మకాలకు సంబంధించి నారాయణపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇవాళ నెల్లూరు చింతారెడ్డి పాలెంలోని ఆయన నివాసంలో సోదాలు చేపట్టారు. నారాయణ నివాసానికి గేటు వేసి లోపలికి ఎవరినీ వెళ్లనీయకుండా సోదాలు కొనసాగిస్తున్నారు.

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని నారాయణ నివాసంలో సీఐడీ అధికారులు ఇవాళ నోటీసులు అందజేశారు. నారాయణ అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్యకు నోటీసులు అందజేశారు. ఈనెల 22న విజయవాడలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. సీఐడీ సైబర్ సెల్ విభాగం

తరువాయి 2లో..



# మత్స్య సామగ్రి కొనుగోలుకు టెండర్లు



శ్రీకాకుళం : జిల్లాలో మత్స్య సామగ్రి కొనుగోలుకు టెండర్లు పిలుస్తున్నట్లు మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ మత్స్య శాఖ ద్వారా ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (PMMSY) క్రింద 2020-21 సంవత్సరానికి వివిధ పథకములు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా చేప పిల్లల సరఫరా, రిజర్వాయరు, సముద్రంలో పంజరాలు (కేజ్) నిర్మాణం, ఇన్సులేటెడ్ వాహనములు సరఫరా, చేపల రవాణాకు ఐస్ బాక్సులతో సహా మోటారు సైకిల్, సముద్రములో చేపల వేట చేయు ఫైబర్ బోటులు, ఇంజెన్లు, వలల కొనుగోలుకు రూ.11.45 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పరికరాల సరఫరాకు ఈ -- పాక్యూరెమెంట్ ద్వారా టెండర్లు పిలవడం జరుగుతుందని అన్నారు.

టెండర్లు ఈ నెల 25వ తేదీ వరకు సమర్పించుటకు గడువు ఉందని జెడి తెలిపారు.

# 'లోకల్ షాప్స్ ఆన్ అమెజాన్'కు అనూహ్య స్పందన

విశాఖపట్నం: లోకల్ షాప్స్ ఇన్‌ఎమెజాన్ కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన వస్తున్నట్టు ఆ సంస్థ హెడ్ మనీష్ తివారీ చెప్పారు. ఈ షాప్స్ కార్యక్రమంలో ఏభైవేలకు పైగా ఆలైన్ రీటైలర్స్ ఇరుగు, పొరుగు వ్యాపారులు ఉన్నారన్నారు. 2020 ఏప్రిల్ నెలలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆన్లైన్ రీటైలర్లు, పొరుగు దుకాణాల వారికి ఈ కామర్స్ ప్రయోజనాలను అంది స్తుందన్నారు. అప్పటికే దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులతో పాటు అమెజాన్.ఇ లోని డిజిటల్ ఉనికిని అదనంగా అందించి, వాళ్ల వ్యాపార విస్తరణకు దోహదం చేస్తుందన్నారు. లోకల్ షాప్స్ ఇన్ అమెజాన్ కార్యక్రమంతో ప్రజలు తమ నగరంలోనే తెలిసిన వారి నుంచే తమకు అవసరమైన ఉత్పత్తులు పొందవచ్చన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## టెస్టులు.. టీకా కేంద్రాలు పెంచండి

వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగం పుంజుకుందని చెప్పారు.

వైరస్ కట్టడికి భారీగా పరీక్షలు నిర్వహించంతో పాటు కొవిడ్ నిబంధనల్ని మరింత కఠినంగా అమలుచేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. సెకెండ్ వేవ్‌ను అడ్డుకొనేందుకు నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలన్నారు. గత కొన్ని రోజులుగా పలు జిల్లాల్లో కేసులు పెరగడాన్ని ప్రస్తావిస్తూ.. ఆర్‌టీ-పీసీఆర్ పరీక్షలను పెంచాలని, ఇన్ఫెక్షన్‌ను గుర్తించేలా చిన్నచిన్న పట్టణాలపై దృష్టిసారించాలన్నారు. అలాగే, ఆయా రాష్ట్రాల్లో నిర్వహించే కొవిడ్ పరీక్షల్లో 70శాతం ఆర్టీ-పీసీఆర్ టెస్టులే చేయాలన్నారు. కేరళ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, యూపీలను ప్రస్తావిస్తూ యాంటీజెన్ పరీక్షలపై ఆధారపడొద్దని సూచించారు.

## నారాయణ నివాసంలో సీఐడీ సోదాలు

డీఎస్పీ ఎ.లక్ష్మీనారాయణ పేరిట ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఇదే కేసుకు సంబంధించి ఈనెల 23న విచారణకు హాజరుకావాలని మాజీ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబుకు సీఐడీ అధికారులు నిన్న నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అమరావతి అసైన్డ్ భూముల వ్యవహారంలరో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు.

**నాలుగు రోజుల కిందట ఎఫ్ఐఆర్**

'గత ప్రభుత్వంలోని కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు తమను మోసగించారంటూ నా నియోజకవర్గానికి చెందిన కొంతమంది రైతులు నాకు వినతిపత్రం ఇచ్చారు. తమ భూముల్ని అక్రమంగా, మోసపూరితంగా తీసుకున్నారని వారు నా దృష్టికి తీసుకొచ్చారు. అసైన్డ్ భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే భూ సమీకరణ కింద వాటిని ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొంటూ కొంతమంది మధ్యవర్తులు అమాయక రైతుల్లో గందరగోళం సృష్టించారు. భూములు పోతాయనే అభద్రతను, భయాన్ని కల్పించారు. పెద్ద కుట్రలో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని నేను పరిశీలించాను. అందులో అనేక అవకతవకలు ఉన్నాయి. వాటి వల్ల ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈ జీవోల ద్వారా గత ప్రభుత్వ హయాంలోని వ్యక్తులు అనుచిత లబ్ధి పొందారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి' అని గత నెల 24న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. సీఐడీ విభాగాధిపతి పీవీ సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా మర్నాడే సీఐడీ అధికారులు ప్రాథమిక విచారణకు ఆదేశించారు. డీఎస్పీ ఎస్.సూర్యభాస్కరరావును విచారణాధికారిగా నియమించారు. ఆయన ఈనెల 12న నివేదిక సమర్పించారని, నేరం జరిగినట్లు అందులో తేలడంతో కేసు నమోదు చేసినట్లు సీఐడీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# బుడమేరుకు నీటిని విడుదల చేయండి

## ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించిన మంత్రి కొడాలి నాని



గుడివాడ : బుడమేరుకు నీటిని విడుదల చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు ( నాని ) ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు . బుధవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని నందివాడ మండలం ఇలపర్రు , లక్ష్మీనరసింహపురం గ్రామాలకు చెందిన రైతులు కూనపరాజు రంగరాజు , తమ్మినేని రోమేశ్వరరావు , ఆర్ నాగరాజు , టీ శేఖర్ , ఎం వాసుదేవరావు , కే నాగేశ్వరరావు , ఎస్ రంగారావు , ఎస్ దుర్గారావు తదితరులు కలిశారు . ఈ సందర్భంగా రంగరాజు , రోమేశ్వరరావులు మాట్లాడుతూ బుడమేరు ద్వారా వచ్చే నీటిని ఇలపర్రు , లక్ష్మీనరసింహపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు సాగు అవసరాలకు వినియోగించుకుంటున్నారన్నారు . అలాగే ఈ నీటిని మంచినీటి చెరువుల్లో నింపుకోవడం ద్వారా తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నామన్నారు . బుడమేరులో నీటి మట్టం తగ్గుముఖం పట్టిందని , దీంతో మంచినీటి చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయన్నారు . వ్యవసాయాన్ని సాగు చేసే రైతులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు . బుడమేరుకు నీటిని విడుదలయ్యేలా చూడాలన్నారు . అలాగే లక్ష్మీనరసింహపురం కాలనీలో ఇరిగేషన్ శాఖకు చెందిన భూమి ఉందన్నారు . గతంలో ఈ ప్రాంతంలో అనేక మంది ఇళ్ళను నిర్మించుకున్నారన్నారు . మరో 100 మంది హౌసింగ్ బోర్డు ద్వారా ఇళ్ళను నిర్మించుకునేందుకు సిద్ధం కాగా ఈ ప్రాంతం 22 ఏ జాబితాలో ఉందని తేలిందన్నారు . రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు . లక్ష్మీనరసింహపురంలోని కాలనీలో ఉంటున్న పేదల ఇళ్ళస్థలాలను 22 ఏ జాబితా నుండి తొలగించేలా చూడాలని వారు కోరారు . అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ లక్ష్మీనరసింహపురం గ్రామంలోని కాలనీలో నివశిస్తున్న ప్రజలు తమ ఇళ్ళస్థలాలను 22 ఏ జాబితా నుండి తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు . ప్రభుత్వానికి చెల్లిస్తున్న శిస్తులు , విద్యుత్ బిల్లుల చెల్లింపులు వంటి వివరాలను కూడా జత చేయాలన్నారు . అధికారులు ఆయా స్థలాలను పరిశీలించి చర్యలు తీసుకుంటారని మంత్రి కొడాలి నాని తెలిపారు .

# కరోనా పరీక్షలను పెంచాలి

## : సీఎం వైఎస్ జగన్




అమరావతి : కరోనాపై వివిధ రాష్ట్రాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వ్యాక్సినేషన్ ప్రక్రియకు ఎన్నికల ప్రక్రియ అడ్డుగా మారింది. అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో మునిగిపోయింది. జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల ప్రక్రియలో ఇక ఆరు రోజులు మాత్రమే మిగిలి ఉంది. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఇవి కూడా జరిగిపోయి ఉంటే బాగుండేది. కానీ అలా జరగలేదు, జాప్యం జరుగుతూ వస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసులను, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ప్రక్రియను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ముగించాల్సిన అవసరం ఉంది.

ఈ ప్రక్రియ పూర్తైతే వ్యాక్సినేషన్ ప్రక్రియను ఉద్ధృతంగా ముందుకు తీసుకెళ్లవచ్చు. లేకపోతే వైరస్ వ్యాపిస్తున్న ప్రాంతాల్లో కంటైన్‌మెంట్ చేయడం, ఆయా ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించడం..ఇవన్నీకూడా కష్టం అవుతాయి. మిగిలిపోయిన ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయడానికి అధికారులు ప్రయత్నించాలి. ప్రభుత్వం తరఫున అధికారికంగా గవర్నర్‌కు, హైకోర్టుకు నివేదిం చాలి" అని సీఎం జగన్ పేర్కొన్నారు.

ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. వ్యాక్సినేషన్ ప్రక్రియపై దృష్టి పెట్టాలని, 45 ఏళ్లకు పైబడి, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నవారికి వ్యాక్సిన్లు సత్వరమే అందించాలని సీఎం జగన్ అధికారులకు ఆదేశించారు. వైరస్ సోకినవారికి చికిత్స అందించడం కన్నా... ఆ వైరస్ రాకుండా నివారణా పద్ధతులపై దృష్టిపెట్టాలని తెలిపారు. కరోనా పరీక్షల సంఖ్యను పెంచాలని, పూర్తిస్థాయిలో నూటికి నూరుశాతం ఆర్టీపీసీఆర్ పరీక్షలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నాని, హోంమంత్రి మేకతోటి సుచరిత, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మార్చి 26 దేశవ్యాప్త బంద్‌కు వామపక్షాల మద్దతు



విశాఖపట్నం : మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా అఖిల భారత కిసాన్ సంఘర్షణ సమితి ఈ నెల 26వ తేదీన ఇచ్చిన దేశవ్యాపిత బంద్ పిలుపుకు పూర్తి మద్దతును ప్రకటించి బంద్‌ను రాష్ట్రంలో జయప్రదం చేయాలని నిర్ణయించింది. రైతాంగ సమస్యలతో పాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖలోని రైతాంగం, కార్మిక, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, సంఘాలు ఈ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్షాలు విజ్ఞప్తి చేశాయి. రాష్ట్రప్రభుత్వం ఈ బంద్‌కు మద్దతు ప్రకటించాలని మరియు రవాణా, విద్యా, రాష్ట్ర సర్వీసులు అన్నీ సమ్మెలో పాల్గొనెలా ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. తెలుగుదేశం పార్టీ, జనసేన కూడా మద్దతు ప్రకటించాలని కోరుచున్నాం.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత నెల రోజులుగా కార్మిక సంఘాలు, వివిధ ప్రజాసంఘాలు చేస్తున్న ఆందోళనలకు సమావేశం పూర్తి మద్దతు ప్రకటించింది. రాబోయే కాలంలో వారు చేపట్టే వివిధ ఆందోళనలకు పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది. విశాఖ నగరంలో అభివృద్ధి ప్రభుత్వరంగ సంస్థల మీదే ఆధారపడి వుంది. ఈ సంస్థలు ప్రైవేటీకరణ అయితే విశాఖ నగరం తీవ్రంగా దెబ్బతింటుంది.

ఈ నెల 15,16 తేదీల్లో బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా లక్షలాదిమంది సమ్మె చేశారు. మార్చి 17వ తేదీ జనరల్ ఇన్సూరెన్స్, మార్చి 18 ఎల్ఐసి ఉద్యోగులు దేశవ్యాప్తంగా సమ్మె చేయబోతున్నారు. ఈ సమ్మెలకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయి. ఈ నెల 20న వేలాది మంది కార్మికులతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుచున్న కార్మిక బహిరంగ సభకి కూడా వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటిస్తున్నాము.

ఈ సమవేశాంలో సిపిఎంనుండి కార్యవర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి కుమార్, నగరకమిటీ సభ్యులు వి కృష్ణరావు, యుఎస్‌న్‌రాజు, సిపిఐ నుండి వమనమూర్తి , రెహమన్, మన్మధరావు, ఈశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) నుండి గణేష్ పాండా,సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుండి వై కొడయ్య పాల్గొన్నారు.

# జీడి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



శ్రీకాకుళం : జీడీమామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని జీడి రైతులు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమీషనర్ పి.ఎస్.ప్రద్యుమ్నను కోరారు. జీడిమామిడి పంట, రైతుల సమస్యలు తెలుసుకొనుటకు జిల్లా పర్యటనకు విచ్చేసిన కమీషనర్ బుధ వారం వజ్రపు కొత్తూరు మండలం నీలావతి గ్రామాన్ని సందర్శించారు. జీడి పంట పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖాముఖి పాల్గొన్నారు. జీడి రైతుకు గిట్టుబాటు ధర రావడం లేదని, మార్కెట్ లోధర పెరిగినా తగ్గినా ఒకటే ధర చెల్లిస్తున్నారని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) జీడి పప్పును కొనుగోళు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తద్వారా రైతులకు కొంత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. కోల్డు స్టోరేజి ఏర్పాటు చేయాలని కోరారు. జీడి పంటకు ప్రత్యేకంగా ఒక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. జీడి పంటకు సరైన సాగు నీటి సదుపాయం లేదని - బోర్లు తదితర సౌకర్యాలు కల్పించడం వలన మరింత ఉత్పాదకత సాధించుటకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రైతుల సూచనలకు కమీషనర్ ప్రద్యుమ్న స్పందిస్తూ జీడి మామిడి రైతుల సమస్యలపై ముఖ్య మంత్రికి నివేదిక సమర్పిస్తామన్నారు. ా ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, మార్కెంటింగు శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాస రావు, సహాయ సంచాలకులు బి.శ్రీనివాస రావు, కార్యనిర్వాహక ఇంజనీరు జయ శేఖర్, ఉద్యానవన సహాయ సంచాలకులు ఆర్.వి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ అధికారిక భాగస్వామిగా చేరిన అప్‌స్టాక్స్

విశాఖపట్నం :ఇండియన్ ప్రీమియర్ లీగ్ గవర్నరింగ్ కౌన్సిల్ (ఐపీఎల్జీసీ) వేగంగా వృద్ధి చెందుతున్న డిజిటల్ బ్రోకరేజీ సంస్థ అస్టాక్స్ ను ఏప్రిల్ 19 2021వ ఐపీఎల్ అధికారిక భాగస్వామిగా ఎన్నుకున్నట్లుగా వెల్లడించింది. ఈ సందర్భంగా ఐపీఎల్ ఛైర్మన్ బ్రిజేష్ పటేల్ మాట్లాడుతూ ఐపీఎల్ 2021కు అధికారిక భాగస్వామిగా అప్ స్టార్ మా బోర్డ్ పై రావడం సంతోషమన్నారు.

దేశంలో ఎక్కువ మంది వీక్షించే క్రికెట్ లీగ్ గా ఐపీఎల్ నిలిస్తే, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డిజిటల్ వాణిజ్య వేదికగా అప్ స్టాక్స్ నిలుస్తుందన్నారు.

ఈ ఇరు సంస్థల కలయిక ప్రేక్షకులపై భారీ ప్రభావం సృష్టించనుందన్నారు.

అప్ స్టాక్స్ హెడ్ రవికుమార్ మాట్లాడుతూ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులను తాము తీసుకువస్తున్నట్టు చెప్పారు.

# నేడు చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం..

*- అనంతరం వైస్ చైర్మన్ ఎన్నిక... - 28 మంది వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం...*

*- జిల్లా అదనపుఎన్నికలఅధికారి,మరియూ సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య ..*

నర్సీపట్నం : మున్సిపాలిటీ కి సంబంధించి చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నికలు..18 వ తేదీ గురువారం ఉదయం 11 గం. లకు మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో జరగనున్నాయని జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియూ సబ్ కలెక్టర్ ఎన్ మౌర్య తెలిపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ వారి ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లతో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నదన్నారు. మున్సిపల్ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన 28 మంది వార్డు మెంబర్లు, ఎంఎల్ఏ (ఎక్స్ అఫిషియో సభ్యులు) తో కలిపి 29 మంది ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. జిల్లా అదనపు ఎన్నికల అధికారి మరియు సబ్ కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారి గా వ్యవహరిస్తూ కోరమ్ గా ఏర్పడిన సభ్యుల తో ప్రమాణ స్వీకారం చేయించడం జరుగు తుందన్నారు. చైర్మన్ ఎన్నికల ప్రక్రియ లో భాగంగా సభ్యుల్లో ఒకరిని ప్రతిపాదించడం, మరొకరు బలపరచడం జరిగిన తర్వాత చేతులెత్తే ప్రక్రియ ద్వారా చైర్మన్ ను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అదే పద్దతి లో వైస్ చైర్మన్ ఎన్నిక కూడా జరుగుతుందన్నారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ మరియు మున్సిపల్ కమీషనర్ ఎన్ కనకా రావు కౌన్సిల్ హాల్లో నిర్వహించనున్న వార్డ్ మెంబర్ల ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# బట్టు సూర్యకుమారిని కలిసిన కన్నూరు వైసిపిశ్రేణులు



పరవాడ : మండలము కన్నూరు నూతనసర్పంచ్ గొల్లవెల్లికృష్ణవేణి కుమారుడు గొల్లవెల్లిశ్రీనువాసురావు(కన్నూరుశ్రీను) మరియు కన్నూరుపంచాయితీ వైసిపిశ్రేణులు బుధవారము 77వ వార్డు వైసిపి కార్పోరేటర్ బట్టు సూర్యకుమారిని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరము దుశాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మడక జనార్ధన్ , సేనాపతిజుగు నాయుడు, సేనాపతి కనకరాజు,సేనాపతి వెంకటరమణ, ముక్తా వెంకటరమణ,గంతకూరి రవి, ముత్తా రాము ,దినేష్ తథితర్లు పాల్గోన్నారు.



నేడు జరగన్ను జి.వి.ఎం.సి మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికలకు సంబంధించి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల కు విప్ జారీ చేసే అధికారం మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్ కి ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించిన పత్రాలను (ఫారం 01 & 02) జీవీఎంసీ ఎన్నికల అధికారి , అదనపు కమిషనర్లు రమణి , ఆశా జ్యోతి లకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవి రెడ్డి పాల్గొన్నారు.

# అనీల్ కుమార్ రాజుకు అభినందనలు తెలిపిన మహిళలు




సీతమ్మధార : జీవీఎంసీ 14 వార్డు కార్పొరేటర్ గా ఎన్నికైన కటారి అనీల్ కుమార్ రాజు కు ఉత్తర నియోజకవర్గపరిధిలో గల పలువురు మహిళలు అభినందించారు.

ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనీల్ కుమార్ రాజును శాలువా తో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి సుజాత, కె రవణమ్మ , సి హెచ్. బాలాకుమారి, బి. ఆదిలక్ష్మి, బి పావని రెడ్డి , కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడండి

**- టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థులకు ఘన సన్మానం**



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ నగర కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన జీ.వీ.ఎం.సీ వార్డ్ తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ అభ్యర్థులకు మొత్తం 31 మంది ది కార్పొరేట్ అభ్యర్థులకు కు సన్మానం కార్యక్రమం జరిగింది. తెలుగుదేశంపార్టీ ప్రకటించిన నగర మేయర్ అభ్యర్థి గా పీలా శ్రీనివాసరావుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి బండారు సత్య నారాయణ మూర్తి, విశాఖ పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, శాసన సభ్యులు గణ బాబు, వెలగ పూడి రామ కృష్ణ బాబు, ఎం ఎల్ సి లు దువ్వరపు రామారావు, నాగ జగదీశ్వర రావు, నాయకులు ఎం శ్రీభరత్ , అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు. వెంకట పట్టాభి. లోడ గాల కృష్ణ. మల్ల సురేంద్ర అధిక సంఖ్యలో కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ అందరూ హాజరై ఒకరినొకరు అభినందించు కున్నారు.

# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి




విశాఖపట్నం : స్థానిక డాల్ఫిన్ హొటల్లో 2020-21 సం. నకు గాను పెన్ స్కూల్ విద్యార్థులు ఇన్వెస్టర్ వేడుక ఘనంగా జరుగింది. తొలుత జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైనది. ఈ సందర్భంగా పెన్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీమతి అనిత పెరేరా విద్యార్థులను ద్దేసించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థుల నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు చదువు తో పాటు క్రమశిక్షణ నాయకత్వ పరిమ అలవరచు కోవాలని విద్యార్థులకు హితవు పలికారు. అందుకుగాను ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. తదనంతరం 2020-21 సం. నకు గాను ఎంపిక కాబడిన పెన్ స్కూల్ కెప్టెన్స్ ( Dabagardens & Akkayyapalem branch- es ) House Captains , Discipline Captains , Deputy Captainsకు బాడీలను అందజేసి వారితో స్కూల్ ప్రతిజ్ఞ గావించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు ప్రైవేటీకరణ కు నిరసనగా నిర్వాసితుల ర్యాలీ




గాజువాక: విశాఖ ఉక్కు ప్రయివేటికరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్ష శిబిరం నుండి స్టీల్ ప్లాంట్ పరిపాలన భవనం వరకు బుధవారం నిర్వాసితులు నిర్వహించిన భారీ ర్యాలీలో జి ఎస్ ఎల్ ఉమెన్స్ వీకర్స్ సొసైటీ ఛైర్పర్స్ శ్రీమతి బొండా శ్రీదేవి,జీలకర్ర భువనేశ్వరి,రామలక్ష్మి, రమణమ్మ, వెంకటి, బీజేపీ జిల్లా బి సి మోర్చా ప్రధాన కార్యదర్శి బొండా యల్లాజీ రావులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బొండా శ్రీదేవి మాట్లాడుతూ ఈ ఉద్యమం అంతం కాదు ఆరంభం మాత్రమేనని, నిర్వాశితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఎంతటి పోరాటాని కయినా వెనుకాడేది లేదని అన్నారు. బొండా యల్లాజీరావు మాట్లాడుతూ నిర్వాశితులకు న్యాయం చేయాలనీ, అవసరం అయితే ప్రధాన మంత్రి వద్దకు నిర్వాసిత నాయకులను తీసుకొని వెళ్లి సమస్య పరిస్కారం కొరకు కృషి చేస్తామని అన్నారు.దీనిలో భాగంగా ఈ రోజు గాజువాక బీజేపీ కన్వీనర్ శ్రీ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వాసితుల ఉద్యమానికి పూర్తి మద్దత్తుగా తీర్మానం చేసి పోరాట కమిటీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత నాయకులు పితాని భాస్కర్, గొంతిన నరసింగరావు, ఉమ్మిడి అప్పారావు,సిపిఐ నాయకులు జె వి సత్యనారాయణ మూర్తి, కసిరెడ్డి సత్యనారా యణ, యూనియన్ నాయకులు గంధం వెంకటరావు, విల్లా రామ్మోహన్ కుమార్, కె ఎస్ ఎన్ రావు, నమ్మి సింహాద్రి, దీప్తి లేనింబాబు లు పాల్గొన్నారు.




*దక్షిణ కాశీ గా పేరొంది శ్రీ ముఖలింగేశ్వర క్షేత్రం వార్షిక క్యాలెండర్ ను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పర్లాకిమిడి మహారాణి కళ్యాణి గణపతి రాజరాజేశ్వరి చేతుల మీదుగా మొదటి క్యాలెండర్ ను విడుదల చేయటం జరిగింది మహాశివరాత్రి లింగోద్భవ కార్యక్రమానికి covid 19 నిబంధన కారణంగా ఆమె హాజరు కాలేదు కాబట్టి ప్యాలెస్లో ఆలయ ప్రధాన అర్చకుడు నాయుడు గారి రాజశేఖర్ కోరిక మేరకు ఆయన సొంత నిధులతో రూపొందించిన క్యాలెండర్ ను విడుదల చేశారు.*

# దొండపర్తిలోని రెండో అంతస్తు చెక్క భవనం అగ్నికి ఆహుతి

*- సుమారు 15 లక్షల రూపాయల ఆస్తినష్టం - విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం*



కంచరపాలెం: జనావాసాల మధ్య గల ఓ ఇంట్లో నుండి అకస్మాత్తుగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక చుట్టుపక్కల జనాలు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోగా సుమారు పదిహేను లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు అంచనా వేస్తున్నారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక 27వ వార్డు లోని దొండపర్తి దరి పాలికలవారి వీధిలో గల రెండో అంతస్తులో నివాసముంటున్న కె వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం కుటుంబంతో బయటికి వెళ్లారు. ఈ తరుణం లో ఇంట్లో నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల ఉన్న వారు భయభ్రాంతులకు గురై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక శకటంతో అక్కడికి చేరుకుని సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకున్నారు. ఇంటి భాగమంతా చెక్కతో నిర్మించడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో రెండో అంతస్తు పూర్తిగా కాలిపోయినట్టు అగ్నిమాపక అధికారులు పి సింహాచలం, కే అప్పలనాయుడు తెలిపారు. అధికారులతో పాటు మంటలను అదుపులోకి తీసుకు రావడంలో అగ్నిమాపక శకటం డ్రైవర్ కృష్ణ, సిబ్బంది రాజేష్, శ్రీను, గిరీష్ కృషి చేశారు.

ఇదిలా ఉండగా వెంకటేశ్వరరావు రెండో అంతస్తు చెక్కతో నిర్మాణం చేయడం వల్ల గతంలో పలు సినిమాలు, సీరియల్స్ ఈ ఇంట్లో షూటింగులు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికీ నగరంలో ఏమైనా షూటింగులు జరిగితే మేకప్ కార్యక్రమం ఈ ఇంట్లోనే ఆర్టిస్టులకు జరుగుతుందని వారు తెలిపారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వార్డులో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి..

**31 వ వార్డు టీడీపీ కార్పోరేటర్ వానపల్లి రవికుమార్**

విశాఖపట్నం:- వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని 31 వ వార్డు టీడీపీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ స్పష్టం చేశారు.

31 వ వార్డు టీడీపీ కార్పోరేటర్ గా వానపల్లి రవికుమార్ గెలుపొందిన సందర్భంగా సూర్యభాగ్ ఆటో స్టాండ్ ప్రతినిధి బృందం వార్డు కార్యాలయంలో బుధవారం కలిసి రవికుమార్ ను అభినందించారు. ఈ సందర్భంగా వానపల్లి రవికుమార్ మాట్లాడుతూ 2009 లో ఇదే వార్డు కార్పోరేటర్ గా పనిచేసిన అనుభవం ఉందని, ముఖ్యంగా ఈ వార్డులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని, గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని వార్డు అభివృద్ధికి మరోమారు పునరంకితం అవుతానని పేర్కొన్నారు. వార్డులో వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా లేదని పలు ఏరియాల్లో అంధకారం నెలకొందని వార్డు ప్రజానీకం తమ దృష్టికి తీసుకొచ్చారని, తాను కూడా ఇటీవలే వార్డులో స్వయంగా పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశానని ప్రేయార్టీ ప్రకారం అన్నీ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఆటో స్టాండ్ ప్రతినిధి బృందం సభ్యులకు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు సారిపల్లి మహేష్, నాయకులు శ్రీనివాస్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## జివిఎంసి పాఠశాలలు అభివృద్ధి కి కారణమైన కమీషనర్, ఆదనపు కమీషనర్ కు ధన్యవాదాలు

భీమునిపట్నం : జివిఎంసి పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ఫ్రెంచ్ డెవలప్మెంట్ ఏజెన్స్ సంస్థ ముందుకు రావడానికి కారణమైన జివిఎంసి కమీషనర్ సృజన,అదనపు కమీషనర్ వి.సన్యాసిరావు, జివిఎంసి అధికారులు కు ఎ.పి ఎంటిఎఫ్ అధ్యక్షులు పి.వి.ఎస్ చంద్రరావు, ప్రదాన కార్యదర్శి సి.హెచ్ అమర్నాధ్ ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. విశాఖ నఖరపాలక సంస్థ ను విభిన్న రీతిలో అభివృద్ధి చేసి,స్వచ్ఛ సర్వేక్షణ్ లో స్టార్ రేటింగ్ సాధించడంలోను,జివిఎంసి పాఠశాలలను కనీవినీ ఎరుగని రీతిలో ఆధునీకరించడం ద్వారా ఫ్రాన్స్ ప్రభుత్వ అనుబంధ సంస్థ ఫ్రెంచ్ డెవలప్మెంట్ ఏజెన్సీజివిఎంసి పరిధిలో పాఠశాలలను అభివృద్ధి చేయడం కోసం ముందుకు రావడం, దానికి కారణమైన మీకు ప్రత్యేక ధన్యవాదాలు అని చెప్పారు. వీలైనంత త్వరగా ఆ ప్రజెక్ట్ కార్యరూపం దాల్చి జివిఎంసి పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి గడించాలనీ ఎపి ఎంటిఎఫ్ తరపున ధన్యవాదాలు తెలిపుతున్నట్లు చెప్పారు.

## గోడ కూలి బైక్ ద్వంసం

భీమునిపట్నం: స్థానిక 3 వ వార్డు నేరేళ్ళవలస కోలనీలో డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా కాలువలు త్రవ్వుతుండగా ఈకామ్ ఎక్స్ప్రెస్ ఆఫీసు గోడ కూలిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కాగా అక్కడే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ద్వంసం అయింది.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VIZAG ...ahead

STREET LIGHTING SECTION

'e' Procurement Short Tender Notice No:27/2020-21/EE(Elec)/Dt:17-03-2021

| | | |
|---|---|---|
| 1. Number of Works | : | 10 Nos |
| 2. Value of Works | : | Rs.71.90 Lakhs |
| 3. Down Loading Start Date & Time | : | 18-03-2021 @ 03.00 PM |
| 4. Down Loading End Date & Time | : | 25-03-2021 @ 02.00 PM |
| 5. Last date &Time for submission of Bids | : | 25-03-2021 @ 03.00 PM |
| 6. Date of opening Tenders | : | 25-03-2021 @ 03.30 PM |

Note: Further details at http://www.apeprocurement.gov.in

O/o the EE (Electrical)
Cell No.99480 78504

For Commissioner
EE(Elec)

స్వచ్ఛ ఆంధ్ర — స్వచ్ఛ విశాఖ

ఇంటింట మరుగుదొడ్డి - బహిరంగ మల విసర్జనకు స్వస్తి

# విజయభాను

## సంపాదకీయం

### విద్యాబోధన కీలకమైనదిగా...

రాజకీయ ఆర్థికరంగంలో కాకలు తీరిన పీవీ నరసింహారావుకు సామాజిక పరివర్తనపై కూడా స్పష్టమైన అవగాహన ఉన్నదనడానికి ఆయన అధికార యంత్రాంగంలో తీసుకున్న చర్యలను ఉదాహరణగా చెప్పవచ్చు. మహిళా సమానత్వం సాధించడానికి విద్యాబోధన కీలకమైనదిగా ఆయన భావించారు. 'మహిళల కోసం సంస్కరణలు, భవిష్యత్ అవకాశాలు' అనే అంశంపై న్యూఢిల్లీలో 1991 ఆగస్టు 21వ తేదీన జరిగిన సదస్సులో ఇచ్చిన ప్రారంభోపన్యాసంలో- విద్యారంగంలో వివక్షను రూపుమాపితే, మిగతా సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని ఆయన వివరించారు. మహిళల ప్రయోజనాల పరిరక్షణకు తగిన శాసనం కూడా చేయాలని ఆయన అన్నారు. చట్టం కూడా తోడైతే, విద్యావంతులైన మహిళలు తమ హక్కుల కోసం తామే పోరాడుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల పట్ల వివక్ష పోవాలంటే సమాజంలో పరివర్తన రావాలని కూడా ఆయన బోధించారు.

నేను కొంతకాలం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నాను. అనేక అంశాలు క్రోడీకరించి మానవ వనరుల అభివృద్ధి శాఖను నిర్మించవలసి వచ్చింది. ఇది ఆయా శాఖల కార్యదర్శులను ఒకచోట చేర్చడం కాదు, మానవ వనరులకు సంబంధించిన అనేక అంశాలను ఒక సమ్యగ్దృష్టితో చూడటం. ఒక టీచర్ ఒక విద్యార్థిని పాఠశాలకు తీసుకుపోవాలని భావిస్తుంది. ఆ విద్యార్థి అనారోగ్యం తో ఉన్నాడు కనుక, తల్లి పంపనంటుంది. 'అనారోగ్యం వైద్యశాఖకు సంబంధించినది, నాది విద్యా శాఖ. అందువల్ల విద్యార్థిని తీసుకుపోతాన'ని టీచర్ అంటుంది. టీచర్‌కు ఆరోగ్యంతో సంబంధం లేదు. కానీ, తల్లి తమ బిడ్డ ఆరోగ్యాన్ని, చదువును అన్నింటినీ పట్టించుకుంటుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖ ఒక తల్లి మాదిరిగా అన్ని అంశాలను పట్టించుకోవాలనేది రాజీవ్ జీ ఆలోచన.

కుమారుడు కావొచ్చు, కుమార్తె కావొచ్చు, ఒక శిశువుకు సంబంధించిన అన్ని అంశాలను పట్టించుకోవాల్సిందే. కుమారుడైతే బడికి పంపడం, కుమార్తెను బడికి వద్దనడం సరికాదు. అందువల్లనే బాలికా విద్యకు సంబంధించి ప్రత్యేక కృషి జరుపాలని నూతన విద్యా విధానం సూచిస్తుంది. మొదట విద్యారంగంలో వివక్ష తొలగాలి. విద్యారంగంలో వివక్షను నిర్మూలించినట్లయితే ఇప్పుడు మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు రూపుమాసిపోతాయని నాకు అనిపిస్తున్నది. అన్ని సమస్యలు మటుమాయమైపోతాయని నేననడం లేదు. కొన్ని నిబిడీకృతమైన సమస్యలుంటాయి. కానీ, మానవులతో సాధ్యమైనన్ని సమస్యలు పరిష్కరించవచ్చు. కొందరు తల్లిదండ్రులు కొడుకును బడికి పంపుతారు తప్ప, కుమార్తెను పంపరు. ఈ భావజాలం ప్రజల మనసులో నాటుకుపోయి ఉన్నది. మహిళా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నవారు తల్లిదండ్రుల్లో పరివర్తన తీసుకురావడానికి ప్రయత్నించాలి.

మహిళలు విద్యావంతులైతే, వారి రక్షణకు చట్టం కూడా చేసినట్లయితే, ఇక వారి హక్కుల కోసం వారే పోరాడుతారు. వారి హక్కుల కోసం వారు కాకుండా, మరెవ్వరు పోరాడుతారు? వారు పోరాడకుండా ఉండటం మంచిది కాదు. ఈ పోరాటం ఎంతోకాలం సాగదు. కొంతకాలానికి మగవారు కూడా దిగి వస్తారు. విద్యావంతులైన మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. ఇప్పటికీ సమాజంలో అనేక మూఢ నమ్మకాలు పేరుకుపోయి ఉన్నాయి. సతీసహగమనం వంటి దురాచారాలు పాత కాలానికి సంబంధించినవి ఇంకా ఉన్నాయి. మహిళలు అయిష్టంగానే వీటికి బలవుతున్నారు. ఈ దురాచారం అమలులో ఉన్న ప్రాంతం గురించి నేను వివరాలు సేకరించాను. ఈ హీనమైన దురాచారాన్ని వారు గౌరవనీయమైనదిగా భావిస్తున్నారు. ఈ దురవగాహన ఉన్నంతకాలం స్త్రీల పట్ల ఈ దురాచారం కొనసాగుతూనే ఉంటుంది. దేవదాసీ విధానం మరో దురాచారం. దేవుడు కను క మాట్లాడగలిగితే మనం చేస్తున్న పనులకు తీవ్ర నిరసన వ్యక్తం చేసేవాడు. మనలాగా మరే సమాజం ఇంతగా దేవుడిని వాడుకొని ఉండదు. దేవుడిని అత్యంత దోపిడి చేస్తున్న వాడు మానవుడే.

రాజకీయాల్లో ఏమీ జరుగుతున్నదనేది చూస్తూనే ఉన్నాం. మూఢనమ్మకాలు మనుషుల్లో గాఢంగా నాటుకుపోయి ఉన్నాయి. మనిషికి మతం అనేది అవసరమే కానీ, మతం పేర అనేక నమ్మకాలు ఎంతో నష్టం చేస్తున్నాయి.

## బహిరంగ మలవిసర్జన రహిత ప్లస్ క్షేత్ర సందర్శన

### కేంద్ర బృందం విశాఖ జిల్లా పరిశీలకుడు గజేంద్ర ప్రతాప్ సింగ్



నర్సీపట్నం : కేంద్ర గ్రామీణ మంచినీరు పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో బహిరంగ మలవిసర్జన రహిత ప్లస్ గత ఎనిమిది నెలల నుండి జిల్లాలోని 12 మండలాల్లో 54 పంచాయతీలో ఏ విధంగా నిర్వహణ చేస్తున్నారనే విషయంపై పై కేంద్ర బ్రుందం విశాఖ జిల్లా పరిశీలకులు గజేంద్ర ప్రతాప్ సింగ్ నర్సీపట్నం ప్రాంతంలోని నాలుగు మండలాలను ఆరు పంచాయతీలను సందర్శిం చారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇక నుంచి వంద శాతం మరుగుదొడ్లు వినియోగ ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాల యాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మరుగుదొడ్లు ఉండి వాడకంలో ఉండాలన్నారు. ఘన ద్రవ వ్యర్థ పదార్థాల వేరు చేసే అలవాటు చేసి,సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ హరిత రాయబారులు కి ప్రజలు అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సామూహిక ఇంకుడు గుంతలు వాడుకలోకి తేవాలన్నారు. ప్రతి ఇంటి నుండి వెళ్లే మురుగునీరు ప్రవాహం విషయమై సదరు ఇంటి పౌరులు బాధ్యత వహించాలన్నారు. ప్లాస్టిక్ సేకరణ, ప్లాస్టిక్ నిర్మూలన బాధ్యతాయుతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్ శిరీష రాణి, జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో జయ మాధవి, ఈ లో పి ఆర్ డి సి హెచ్ ప్రేమలీల, గొలుగొండ లో సర్పంచ్ కసిపల్లి అప్పారావు, (బుజ్జి), పంచాయతీ పరిపాలన అధికారి రఘు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, హరిత రాయబారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




## సంక్షేమ పథకాల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలి

### - జాయింట్ కలెక్టరు ఎమ్.వేణుగోపాలరెడ్డి



విశాఖపట్నం : జిల్లాలో డి.ఆర్.డి.ఎ., వ్యవసాయ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టరు ఎమ్.వేణుగోపాలరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బ్యాంకు అధికారులతో వై.యస్.ఆర్. సున్నావడ్డీ, వై.యస్.ఆర్. చేయూత పథకాలపై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వై.యస్.ఆర్. సున్నావడ్డీ పథకానికి అర్హత గల రైతులను సకాలంలో గుర్తించాలని ఆయన మాట్లాడుతూ 2019 సం.రబీలో వై.యస్.ఆర్ సున్నావడ్డీ కార్యక్రమంలో అర్హత కలిగిన రైతులు లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకుని సకాలంలో వడ్డీతో సహా పూర్తిగా చెల్లించిన రైతుల జాబితాను వెబ్ సైట్ http://karshak.ap.gov.in8080/ysrsvpr/ లో ఈనెల 25వ తేదీలోగా నమోదు చేయవలసినదిగా కోరడమైనద. ఇందులో ఇప్పటివరకు 14 వేల మంది రైతుల జాబితా నమోదు చేయడమైనది చెప్పారు. నమోదు కార్యక్రమమం తప్పనిసరిగా సకాలంలో పూర్తి చేయవలసిందిగా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అనంతరం చేయూత కార్యక్రమంలో పాడిపశువులు, గొర్రె-మేకలు, రిటైల్, వైయస్సార్ భీమా, జగనన్న తోడు కార్యక్రమాలపై బ్యాంకు రుణాల మంజూరు, లక్ష్యాల సాధనపై సమీక్షించారు.

పాడి పశువులు 4398, గొర్రె-మేక 3692, చేయూత కిరాణా 1222, వైయస్సార్ భీమా 6,05,801 లక్ష్యం సాధించాలని ఆదేశించారు. లక్ష్యాన్ని ప్రణాళికా యుతంగా వివిధ శాఖల అధికారులు బ్యాంకు అధికారుల సమన్వయంతో సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ (ఆసరా) ఆర్.గోవిందరావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విశ్వేశ్వరరావు, వ్యవసాయ శాఖ జె.డి.లీలావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనాథ ప్రశాద్, వివిధ బ్యాంకుల కంట్రోలర్ లు పాల్గొన్నారు.

## కవి సమయం

### జీవితం - ఒక గమ్యం

జీవితం ఒక గమ్యం రా...
నడచిన కొలచి యెక్కువరా...
పరుగులు దీసే పయనంరా...
వెళ్ళిన కొలది యెంతోరా...

అడవులలో మానవులున్నా...
కొండల్లో నివసిస్తున్నా...
కాలం మానవ జీవనరా...
నడవడి మానవధర్మమురా...

బతికుంటే బలుసాకన్నారు పెద్దలు
అలగనీ...
లక్ష్య సాధన కాదంటామా?
కడలి ప్రయాణం మానేస్తామా?
గాలివోడలు వద్దంటామా?
శత్రువు నెదిరిస్తాము సరిహద్దుల్లో...

మనిషికి నడుపును జ్ఞానం రా...
మానవా.... నీ... మహనియ్యతినీ...
ఆరోగ్యం మనిషికిరా...
ముసలితనం కాదురా...
మహాభాగ్యంగా...
మోయుమురా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : ఫాల్గుణ; తిథి :చవితి రా. 9.3 | గురువారం
భరణి పూర్తి (24-0)వ.సా. 4.32ల 6.18 | 18-03-2021

a **మేషం** : సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు. b **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసివచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందుతుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. అవివా హితులకు అనుకూలం. కొత్త పరిచ యాలు ఏర్పడతాయి. c **మిథునం** : ఇతరులపై ఆధార పడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి. e **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసు కుంటుంది. వాహన యోగం పొందుతారు. e **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబం ధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. f **కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహ రిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. g **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెల కువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగాలు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కల యిక ప్రయోజనకరంగా ఉంటుంది. h **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారు లకు సంతృప్తి, పురోభివృద్ధి. భాగ స్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వస్త్రాలు, వస్తువులు అమర్చు కుంటారు. i **ధనుస్సు** : టెక్నికల్, ఎలక్ట్రానికల్ రంగా లలో బాగా అభివృద్ధి చెందు తారు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. సన్నిహితుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్త్రీలకు విలువైన వస్తు వులు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లు సంతృప్తి, పురోభివృద్ధి. j **మకరం** : మీ ముఖ్యుల కోసం ధనం బాగా వెచ్చించవలసి వస్తుంది. నూతన దంపతులకు ఎడబాటు తప్పదు. ఉద్యోగస్తులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. మీ సంతానం మొండి వైఖరి మిమ్ములను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం.నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవ తారు. k **కుంభం** : నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకారం అందిస్తారు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. L **మీనం** : మీ సంతానం ఉన్నత విద్యావకాశాల గురించి ఆందోళన చెందుతారు. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు విలువైన వస్త్రాలు, ఆభరణాలు అమర్చుకుంటారు. బంధు మిత్రుల కల యికతో నూతన ఉత్సాహం కానవస్తుంది. గృహంలో మార్పులు, మరమ్మత్తులు చేపడతారు.

## సంకీర్తన

## ఈ పుష్కరిణిలో స్నానం చేస్తే చాలు!



కొలువైన పరమ పవిత్రమైన క్షేత్రాలలో 'గురువాయూర్' ఒకటి. దేవతల గురువైన బృహస్పతి .. వాయుదేవుడు కలిసి ఇక్కడ కృష్ణుడి మూర్తిని ప్రతిష్ఠించడం వలన ఈ క్షేత్రానికి ఈ పేరు వచ్చింది. ఇక్కడి 'రుద్ర తీర్థం' మహిమాన్వితమైనదిగా చెప్పబడు తోంది. ఈ తీర్థంలో స్నానం చేసినవారు వ్యాధుల నుంచి బయటపడతారనడానికి అనేక నిదర్శనాలు వున్నాయి.

తన తండ్రి 'పరీక్షిత్తు' మహారాజు 'తక్షకుడు' అనే పాము కాటు కారణంగా మరణించడంతో, ఆయన కుమారుడైన 'జనమేజయుడు' సర్పజాతి పట్ల ద్వేషంతో 'సర్పయాగం' చేశాడు. అలా అనేక సర్పాలను చంపిన పాప ఫలితంగా ఆయనకి 'కుష్ఠు వ్యాధి' సంక్రమించింది.

ఆ వ్యాధితో బాధపడుతోన్న ఆయనకి పరశురాముడు తారసపడతాడు.' 'గురువాయూర్'లోని 'రుద్ర తీర్థం'లో స్నానమాచరించమని చెబుతాడు. దాంతో ఆయన శ్రీకృష్ణుడిని ఆరాధిస్తూ అనునిత్యం ఆ తీర్థంలో స్నానమాచరిస్తూ వస్తాడు. ఫలితంగా కొంతకాలానికి అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది. ఇలా ఈ తీర్థంలో స్నానమాచరించి వివిధ రకాల వ్యాధుల బారి నుంచి బయటపడినవాళ్లు ఎంతోమంది వున్నారని చరిత్ర చెబుతోంది.

### ఇక్కడి శిల్పకళ చూసి తీరవలసిందే!

ప్రాచీన క్షేత్రాలను దర్శించినప్పుడు అక్కడి శిల్పకళ అద్భుతమనిపిస్తుంది .. ఆశ్చర్యానందాలను కలిగిస్తుంది. అలా శిల్పకళతో సహా విలసిల్లే క్షేత్రాలలో ఒకటి చిత్తూరు జిల్లా 'సోంపాళ్యం'లో కనిపిస్తుంది. ఇక్కడ ఆవిర్భవించిన చెన్నకేశవస్వామికి విజయనగర రాజులు ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది.

సువిశాలమైన ప్రదేశంలో ఈ ఆలయం నిర్మించబడింది. పొడవైన ప్రాకారాలు .. మంటపాలు .. స్తంభాలు ఆలయ వైభవానికి అద్దం పడుతుంటాయి. గర్భాలయంలో చెన్నకేశవస్వామి .. ప్రత్యేక మందిరంలో లక్ష్మీదేవి పూజలు అందుకుంటూ వుంటారు. ఈ ఆలయంలో గోడలు .. స్తంభాలు .. మంటపాలు అన్నీకూడా అలనాటి శిల్పకళా వైభవాన్ని ఆవిష్కరిస్తుంటాయి.

పురాణ దృశ్యాలతో పాటు ప్రత్యేక శిల్పాలు ఔరా! అనిపించకమానవు. అమరశిల్పి జక్కన్న .. ఆయన శిష్య బృందం ఈ శిల్పాలను మలిచారని చెబుతారు. అందమైన ఆ శిల్పాలను వాళ్లు మలిచింది రాయితోనా .. మైనంతోనా అనే ఆశ్చర్యం కలిగేంతగా ఆ శిల్పకళ ఉంటుంది. స్వామివారి మహిమలతో పాటు .. అలనాటి శిల్పుల అద్భుతమైన శిల్పకళా చాతుర్యం కారణంగా, ఈ క్షేత్రం మరింత విశిష్టతను సంతరించుకుని కనిపిస్తుంది.



# అంగన్వాడీ లు సామాజిక దృక్పదంతో పనిచేయాలి

- కోవిడ్ వ్యాప్తి సమయంలో హెల్త్ సిబ్బందికి ధీటుగా అంగన్వాడీ లు విదులు నిర్వహించారు ....
- బాల్య వివాహలు ఆరికట్టడంలో సఫలీకృతమయ్యాము.....
- అంకితబావంతో విదులు నిర్వహించిన ఉద్యగులకు ప్రశంశ పత్రాలు ....
- జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శీతా మహాలక్ష్మీ .....



కంచరపాలెం : విధి నిర్వాహణలో అంగన్వాడీ లు ఉద్యోగి లా కాకుండ సామాజిక దృక్పదంతో పనిచేయాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శీతా మహాలక్ష్మీ పిలుబునిచ్చారు .

ఈమేరకు " పోషణ్ పక్వడా " కార్యక్రమంలో బాగంగా ఆర్.అండ్.బి కూడలి వద్ద నున్న ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 కార్యలయంలో బుదవారం నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో ఆమే పాల్గున్నారు. ఈసందర్బంగా ఆమే మాట్లడుతూ జిల్లా వారిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బాల్య వివాహాలపై దృష్టి సారించి బాల్య వివాహాలను నిర్మూలించే విషయంలో సఫలీకృతమయ్యామని అన్నారు. కోవిడ్ వ్యాప్తి సమయంలో హెల్త్ సిబ్బందికి ధీటుగా రెడ్ జోన్ ప్రాంతల్లో అంగన్వాడీ లు కీలకంగా వ్యవహరించి "టి.హెచ్ .ఆర్" పంపిణీ చేయడంతో పాటుగా గర్భిణీ , బాలింతల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించారని అన్నారు .

పిల్లల్లో పౌష్టిక ఆహార లోపం అధిగమించేందుకు వెయ్యి రోజుల కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కార్యక్రమంలో బాగంగా పుట్టిన శిశువు నుండి శిశువు కు ఐదు సంవత్సరాలు నిండే వరకు శిశువు ఆరోగ్యంపై పర్యవేక్షించడం జరుగు తుందన్నారు.

ముక్యంగా కన్వెంట్ లో చదివే పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు చాల చాల వ్యత్యాసముంటుందని అంగన్వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలు చురుగ్గ స్కూల్ కు వెళ్తే కన్వెంట్ కు వెళ్ళే పిల్లలు స్కూల్ కు వెళ్లేందుకు మారం చేస్తారని అన్నారు .అదే విదంగా ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీల పనితీరు , అంగన్వాడీల సమష్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు .

కార్యక్రమంలో బాగంగా సెక్టర్ సూపర్ వైజర్ లు , అంగన్వాడీ సిబ్బంది కి అలాగే సచివాలయం ఎం .ఎస్ .కె లకు ఉత్తమ ఉద్యోగి ప్రశంశ పత్రాలతో పాటుగా జ్ఞాపికను అందజేసారు.

అంతకుముందు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శీతా మహాలక్ష్మీ కి సెక్టర్ సూపర్ వైజర్ లు , అంగన్వాడీలు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసారు . కార్యక్రమాన్ని ఐ .సి.డి.ఎస్ అర్బన్ -1 సి.డి.పి.ఓ రమణకుమారి పర్యావేక్షించారు ..

# ఆధ్యాత్మిక గ్రంధాలు హైందవ సంపదే

## - స్వాత్మానందేంద్ర స్వామి



రాజమండ్రి : హైందవ ధర్మ జాగృతికి ఆధ్యాత్మిక గ్రంధాలు దోహదపడుతున్నాయని విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. ఆధ్యాత్మిక గ్రంథాలను సనాతన హైందవ సంపదలా మనమంతా చూడాలని సూచించారు. మానవులు తమ విరామ సమయాన్ని ఆధ్యాత్మిక గ్రంధాలు చదివేందుకు కేటాయిస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని స్వామీజీ పేర్కొన్నారు. హిందూ ధర్మ ప్రచార యాత్రలో భాగంగా రాజమండ్రి లో పర్యటించిన ఆయన కోటగుమ్మం వద్ద ఉన్న గొల్లపూడి వీరాస్వామి ఆధ్యాత్మిక గ్రంథాల భాండాగారాన్ని సందర్శించారు. వినాయక వ్రతకల్పం నుండి రామాయణ, భారత, భాగవత గ్రంధాల వరకు ఒకేచోట అందుబాటులో ఉంచడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. పూర్వ జన్మ సుకృతం వల్లే ఇటువంటి వ్యాపార ఆలోచనలు వస్తాయని గొల్లపూడి వీరస్వామి సన్స్ ను అభినందించారు. ఈ సంస్థను నిర్వహించడం కూడా భగవంతుని సేవగానే చూడాలన్నారు. ఆధ్యాత్మిక గ్రంథాలను విక్రయించడమే కాకుండా మరెన్నో గ్రంధ రచనలను పుస్తక రూపంలో తెచ్చేందుకు సంస్థ చేసిన కృషిని నిర్వాహకులు స్వామీజీకి వివరించారు. ఆదరణ తక్కువగానే ఉన్నా హైందవ ధర్మానికి ఊతమిస్తుందన్న ఉద్దేశ్యంతోనే సంస్థను నిర్వహిస్తున్నామని చెప్పారు. గొల్లపూడి వీరాస్వామి సన్స్ వ్యాపార సముదాయంలో అందుబాటులో ఉన్న గ్రంధాలను స్వాత్మానందేంద్ర స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని గ్రంధాలను స్వామీజీ స్వయంగా కొనుగోలు చేసారు. యాజమాన్య ప్రతినిధులను విశాఖ శ్రీ శారదాపీఠం దుశ్శాలువతో సత్కరించారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలి

## అనంతగిరి పంచాయతీ సర్పంచ్ సోమెలరూతు

అనంతగిరి : అనంతగిరి మండలం అనంతగిరి పంచాయతీ బొడ్డచెటుకోలనీ గ్రామంలో అక్రమ నిర్మాణాలను కూల్చి అక్రమరిజిస్ట్రేషన్లు చేసి పట్టాచేయించుకొన్న గిరిజనేతరుడైన గండిలూక్ బాబు పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని LTR కేసులు నమోదు చేయాలని అనంతగిరి సర్పంచ్ సోమేల. రూతు మరియు గిరిజన సంఘం ఆధ్వర్యంలో అనంతగిరి తహసీల్దార్ కె వెంకట వరప్రసాద్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈసందర్భంగా అనంతగిరి సర్పంచ్ సోమేల. రూతు. గిరిజన సంఘం నాయకులు దీసరి గంగరాజు. కిల్లో. మోస్య మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే గిరిజనేతరుడైన గండి లూక్ బాబు పేరున ఖాతా నెం. 78 సర్వే నెం. 26. 1-A లో 70సెంట్లు భూమిని అక్రమరిజిస్ట్రేషన్లు చేయించడం జరిగింది.

అనంతగిరి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో జెట్టి ఆర్,ఐ,పోలికమ్మ మరియు అప్పటి తహశీల్దారు కలసి అక్రమ రిజిస్ట్రేషన్లు చెయించారు 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్న సంబంధిత అధికారులుపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేయడం జరిగింది. లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది. ఈ విషయంపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వారికి పాడేరు ఆర్డీవో గారికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరుగుతుంది. ఈకార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ జన్ని. సుబ్బారావు. దీసరి. దేముడమ్మ స్థానికులు పాల్గొన్నారని సర్పంచ్ సోమెల రూతు తెలిపారు,



# రంగసీల సర్పంచ్ తాంగుల ముత్యాలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్





పాడేరు : హుకుంపేట మండలం రంగాసీల పంచాయతీ సర్పంచ్ తంగుల ముత్యాలమ్మ భర్త అయిన తంగుల భగత్ రాం నిన్న రాత్రి జరిగిన ప్రమాదం లో మృతిచెందారు. తాంగుల భగత్ రాం నిన్న రాత్రి బైక్ ప్రమాదానికి గురయ్యారు భగత్ రాం అక్కడికక్కడే మృతి చెందడంతో మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ వారి స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు అన్ని రకాలుగా మీకు తోడుగా అండగా ఉంటానని ఏ అవసరం వచ్చినా నా దృష్టికి తీసుకురావాలని కుటుంబ సభ్యులను భరోసా ఇచ్చారు.

మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ వెంట జెడ్ పి టి సి అభ్యర్థి సాగర సుబ్బారావు మాజీ సర్పంచ్ వాసుదేవ్ మురళి ఉన్నారు.

# పనులు ప్రారంభం కావాలి

శ్రీకాకుళం, : భూసేకరణ జరిగిన ప్రాంతాల్లో పనులు ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టుల భూసేకరణపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. హై లెవెల్ కెనాల్, వంశధార, తోటపల్లి తదితర ప్రాజెక్టుల క్రింద జరుగుతున్న పనులను సమీక్షించారు. సకాలంలో పనులు పూర్తి కావాలని, పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తరాదని ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, వంశధార ఎస్ఇ డోల తిరుమల రావు, ఇఇ రామచంద్ర రావు, ఎస్డీసీలు బి.శాంతి, కాశివిశ్వనాథ రావు, జి.సుజాత, సంబంధిత తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ




భీమునిపట్నం: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ లో అవంతి కళాశాల, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ 100సంవత్సరాలు అయిన సందర్భంగా విజయనగరం నుంచి విశాఖపట్నం వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎపి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎ.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కె.శ్రీనివాసరావు, జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అవంతి కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎన్ గణేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ అర్జునరావు,డిగ్రీ ప్రిన్సిపల్ రామకృష్ణ, ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

# నైతిక విజయం మాదే

**టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ్మిన సూరిబాబు, రవ్వ వెంకట్ రావు**



భీమునిపట్నం: జీవీఎంసీ ఒకటో వార్డు ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని టిడిపి పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తమ్మిన సూరి బాబు, రవ్వ వెంకట్రావు అన్నారు. వాలంటీర్లు, ఆర్ పి లు వైకాపా తరపున ప్రచారం చేసి ఓటు వేయకుంటే పథకాలు తీసుకొస్తామని బెదిరించారని అన్నారు. అయినప్పటికీ కి నియోజకవర్గంలోనే 9 వార్డుల్లో ఐదు వార్డులు టిడిపి గెలిచి మెజార్టీ సాధించిందన్నారు. ఈ విజయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ది కాదని వాలంటీర్ల దని అన్నారు. టిడిపి ఓటు బ్యాంకు చెక్కుచెదర లేదని అన్నారు.ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిగి ఉంటే విశాఖ మేయర్ పీఠం టిడిపి గెలిచేది అన్నారు. మాజీ సీఎం తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దేవుళ్ళు, మాజీ ఫ్లోర్ లీడర్లు చిలకా నర్సింగ రావు కోసూరు రాంబాబు, నాయకులు గరే చంద్రమౌళి ,సత్య, పిల్లా రాజేష్, సుబ్బారావు, నరవ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# పీజో మీటర్లు ద్వారా భూగర్భజల మట్టం లోతు పరిశీలన




శ్రీకాకుళం : పీజో మీటర్ల ద్వారా భూగర్భ జల మట్టం లోతు పరిశీలించడం జరుగుతోందని భూగర్భ జలం, జల గణన శాఖ ఉపసంచాలకులు సి.ఎస్.రావు అన్నారు. భూగర్భ జలం, జల గణన శాఖ స్వర్ణోత్సవాలలో భాగంగా శ్రీకాకుళం ఉప సంచాలకుల కార్యాలయంలో బుధ వారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పీజోమీటరు ద్వారా భూగర్భ జలమట్టం ఎంత లోతులో వుందో తెలుసుకోటానికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బోరు బావి వంటిదని అన్నారు. పీజోమీటర్లను రాష్ట్రంలో భూగర్భజల పరిస్థితిని ప్రతిబింబించేలా నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు సహకారంతో 1254 ప్రాంతాల్లో ఏర్పాటు చేయగా జిల్లాలో 68 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రాతి పొరల్లో వున్న భూగర్భ జలం ఎంత పరిమాణంలో వుందో తెలుసుకోవటంతో పాటు బావులు లేదా బోరు బావులలో ఎంత లోతులో వుందో తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. భూగర్భ జల లభ్యతా పరిమాణం ఎంత ముఖ్యమో అది అందుబాటులో వుండే లోతు కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ ఎండా కాలంలో బావులు లేదా బోర్లలో నీళ్లు బాగా క్రింది స్థాయిలో ఉంటాయని, వానాకాలంలో పైకి వస్తాయని అందరికీ తెలిసిన విషయమే అయినా అవి ఖచ్చితంగా ఏ కాలంలో ఎంత లోతులో వున్నాయి, కాలానుగుణంగా ఏ రకమైన మార్పులకు లోనవుతున్నాయి అని శాస్త్రీయంగా తెలుసుకొనుటకు పిజో మీటర్లు ఉపయోగపడతాయని వివరించారు. పీజోమీటర్ల ద్వారా తమ ప్రాంతంలోని వాటర్ లెవల్ ను ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన స్మార్ట్ ఫోన్ ద్వారా ఎవరైనా తెలుసుకోవచ్చుని, ఇంటర్ నెట్ సౌకర్యం కలిగిన మీ కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్లో http://www.apwrims.ap.gov.in, http://www.apsgwd.ap.gov.in వెబ్ సైట్ల ద్వారా మరియు సి.యం. డ్యాష్ బోర్డు (https://core.ap.gov.in) ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో వాటర్ లెవల్ 2020-21 జల సంవత్సరంలో కురిసిన వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా గ్రౌండు వాటర్ లెవల్ బాగా పెరిగిందని, 2020 జూన్ నుండి ప్రారంభమైన నైరుతి ఋతుపవన వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ఇప్పటి వరకు 787 మి.మీ. వర్షం కురవాల్సి వుండగా 1017 మి.మీ. వర్షం కురిసిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 6.3 మీటర్ల లోతులో నీటి నిల్వల స్థాయి ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూగర్భ జల శాఖ సహయ సంచాలకులు డి.లక్ష్మణ రావు, జిల్లా నీటియాజమాన్య సంస్థ సహాయ సంచాలకులు ఏ.లక్ష్మణ రావు, టెక్నికల్ అసిస్టెంట్ ఏ.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మాదల పంచాయితీలో మంచినీటి సౌకర్యం కల్పించాలి

## : గిరిజన సంఘం డిమాండ్

అరకు లోయ. మండలంలోని మాదల పంచాయితీ మాదల గ్రామంలో మంచినీటి సౌకర్యం తక్షణమే పరిష్కరించాలని వ్యాధుల బారి నుండి గ్రామ ప్రజలను రక్షించాలని బుధవారం మాదల గ్రామపంచాయతీలో మన సంఘం డిమాండ్ చేశారు ఎండకాలం రావడంలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోయారు ఇప్పటికే ఊట నీరు పొలాల్లో నీరు సేవించడం వల్ల పలు వ్యాధుల బారి లో వాంతులు విరేచనాలతో చాలామంది అస్వస్థతకు గురవుతున్నారన్నారు వర్షాకాలంలో పొలం నీరు వల్ల వ్యాధుల బారిన పడుతున్న మన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం డిమాండ్ చేశారు.

కిడ్స్ జోన్

# వాల్ట్ డిస్నీ సృష్టి మిక్కీ మౌస్



మిక్కి మౌస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఆ బొమ్మ ఎలా పుట్టి, వెలుగు చూసిందనే విషయంలో మాత్రం ఇంకా చాలా మందికి సందేహాలున్నాయి. వాల్ట్ డిస్నీ తండ్రి ఓ దర్జీగా జీవనం సాగించేవాడు. పేదరికం కారణంగా డిస్నీ ఎనిమిదో తరగతి మించి చదవలేకపోయాడు. అయితేనేం. తన శక్తిపై గట్టి నమ్మకం కలిగిన డిస్నీ ఏమాత్రం నిరాశ, నిస్పృహలకు గురికాలేదు. ఓ కంపెనీలో పనిలో చేరాడు. అందిన జీతంలో కొంత పొదుపుచేసి, పెయింటింగ్ కళాశాలలో చేరి చదివాడు. ఆసక్తికి తగ్గట్టు అక్కడ పాస్ కూడా అయ్యాడు. ఓరోజు డిస్నీ ఓ చిత్రాన్ని గీసే సమయంలో అక్కడ ఓ చిట్టెలుక ఆడుతూ వచ్చింది.

అది ఏం చేస్తుందోనని డిస్నీ తీక్షణంగా పరిశీలించాడు. దాని చర్యలు ఆయన పాలిట ఓ హీరోయిజంలా అన్పించింది. దీంతో దానినే తన హీరోగా చేసుకుని, కార్టూన్లు రూపొందించాడు. అప్పటినుంచి క్రమంగా ఆ మిక్కీ మౌస్ ఏ స్థాయికి ఎదిగిందనే విషయాన్ని ఇక మీకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదనుకుంటా...

# ఏనుగులకూ లెక్కలొచ్చు





ఏనుగులంటే మీ అందరికీ ఇష్టమే కదూ.. అంత పెద్ద పెద్ద ఆకారాలతో ఉండే ఏనుగులపై ఎక్కి సవారి చేయాలని అందరికీ అనిపిస్తుంది. గుళ్లలో కనిపించే ఏనుగులకు అరటిపండు ఇచ్చి దాని తొండంతో ఆశీర్వాదం తీసుకోవాలంటే మరింత ఇష్టం కదూ.. మరి ఈ ఏనుగులకు కూడా లెక్కలు తెలుసంట. ఆ వివరాలేంటో ఇప్పుడు మనం చూద్దాం.. సాధారణంగా మనం సర్కస్‌లో చూసే ఏనుగులు ఫుట్‌బాల్ ఆడటం, క్రికెట్ బ్యాట్‌తో బంతిని తన్నటం లాంటి విన్యాసాలను చేస్తాయి. అయితే ఆసియా జాతి ఏనుగులకు కూడికలు కూడా తెలుసని జపాన్‌కు చెందిన కొంతమంది పరిశోధకులు నిరూపించారు. అదెలాగంటే.. మొదటగా ఒక బకెట్లో మూడు, మరో బకెట్‌లో ఐదు యాపిల్స్‌ను వేసి.. ఆ తర్వాత వాటికి మరో రెండు చొప్పున యాపిల్స్‌ను పరిశోధకులు జతకలిపారు. అంటే మొత్తం మీద ఒక బకెట్లో ఐదు, మరో బకెట్లో ఏడు యాపిల్స్‌ను వేసి ఎంపిక చేసుకున్న ఒక ఏనుగు ముందు పెడితే.. అది ఆ బకెట్లో ఏముందో చూడకుండానే ఎక్కువ పండ్లున్న బకెట్‌నే ఎంచుకుందట. ఆరుసార్లు ఇలా మార్చిమార్చి చేసినప్పటికీ అది ఎక్కువ పండ్లున్న బకెట్‌నే ఎంచుకుంది. పదిలోపు అంకెలతో కూడిన కూడికలను 87శాతం మేరకు ఆ ఏనుగు ఖచ్చితంగా ఎంపిక చేసుకుందట. కాబట్టి.. ఏనుగులకు కూడా కూడికలు బాగా తెలుసని దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాలి.

# కాగితం ఎలా పుట్టింది..?

కాగితం గురించి ఎంత చెప్పినా తీరదు. ప్రతి చోటా దీని అవసరం ఉందనే విషయం మీకు తెలుసు. అటు మీ పుస్తకాలు అయితేనేం, ఇటు వార్తా పత్రికలు అయితేనేం ప్రతిరోజు ఎంతో జ్ఞానాన్ని అందరికీ పంచుతున్న ఈకాగితం ముక్క అందులో విషయాన్ని చదివేసిన తర్వాత మాత్రం ఎంతో నిర్లక్ష్యానికి గురవుతోంది. అయితే చిత్తు కాగితాలను సైతం భద్రంగా సేకరించేవారున్నారు. అందులోని విషయాలను బట్టి వాటికి విలువ ఉంటుంది. ఇంటర్నెట్ సహా ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ, కాగితం విలువ కోల్పోలేదు. అయితే ఇది ఎలా పుట్టిందో తెలుసుకుందాం. క్రీ.పూ. 200లో పాత వస్త్రాలు, చేపల వలలతో కాగితం తయారుచేశారు. అయితే దాని తయారీ ఖర్చు చాలా అధికంగా ఉండటంతో కొద్ది కాలానికే ఆ ప్రయత్నాన్ని విరమించారు. మూడు వందల సంవత్సరాల తర్వాత కొయ్య సామగ్రి, మొక్కల కాండాలతో కాగితం తయారుచేసే విధానాన్ని శాయ్ లున్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. అప్పటి నుంచి నాణ్యత కలిగిన, చౌక ధరతో కూడిన కాగితం కోసం పరిశోధనలు కొనసాగుతూ వచ్చాయి. ఈ పరిస్థితిలోనే రెణీ డీ రీమర్ ఓ రకమైన ద్రవంతో కాగితం చక్కగా తయారుచేయవచ్చనే విషయాన్ని కనుగొన్నాడు.

చెట్ల కాండాన్ని బాగా రుబ్బడం ద్వారా వస్తున్న గుజ్జుతో ఇంటిని నిర్మించుకున్నాడు. దాంతో ఆయనకు చెట్ల కాండం నుంచి వచ్చే గుజ్జుతో మనం కోరుకునే రూపాన్ని అందుకోవచ్చనే విషయం బోధపడింది. ఆయన కాగితం తయారీకి అప్పట్లో ప్రాథమిక సూత్రం చెప్పగా, కాగితం తయారీ పూర్తి విధానాన్ని ఆ తర్వాత కెల్లర్ కనుగొన్నారు. ఒకే చెట్టు నుంచి పలు రకాలు కాగితాలు తయారుచేయవచ్చు. ఒక్కో రకమైన నాణ్యతకు, ఒక్కో రకమైన యంత్రం, రసాయనాలు వాడాల్సి ఉంటుంది.





# సమతుల సూత్రాలు

మహిళలు సమతుల ఆహారాన్ని వేళ ప్రకారం తీసుకుంటూ, శారీరక వ్యాయామానికి సరైన ప్రాధాన్యమిస్తూ ఉంటే అధికబరువు సమస్యే దరిచేరదు. అయితే, చాలామందికి ఆహారం తీసుకోవడంలో సరైన ప్రణాళిక ఉండదు. దాంతో అధిక బరువుతో పాటు అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నది పోషకాహార నిపుణుల అభిప్రాయం. ఆహార ప్రణాళికకు నిపుణులు అందిస్తున్న 5 సూత్రాలు..

భావోద్వేగాల ప్రభావం ఆరోగ్యం మీద చూపుతుంది. ఇలాంటి సమయాల్లో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, లేదా అసలు తీసుకోకపోవడం జరుగుతుంటుంది. మానసిక ఒత్తిడి అదుపులో లేకపోతే ఆహారం మీద అదుపు ఉండదు. అనారోగ్యకరమైన ఆహారం మరింత మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇదొక విషవలయంగా మనిషిని వేధిస్తూనే ఉంటుంది.

మనిషి తన అవసరాలకు అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. ఆ ఆహారపదార్థాలు సరియైనపాళ్ళలో వుండాలి. అవి ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన శక్తినీ, అమినో ఆమ్లాలనీ, విటమిన్లనీ, లవణాలనీ, కొవ్వునీ, పిండి పదార్థాలనీ ఇవ్వగలిగి వుండాలి. ఇటు వంటి ఆహారాన్ని సమతుల్య ఆహారం అంటాం. ఆహారపదార్థాలు సరియైన పాళ్ళలో లేక పోతే... అంటే- కొన్ని పదార్థాలు ఎక్కువైనా, తక్కువైనా అందులోని సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. అయితే మనం రోజూ తినే ఆహారాన్నే కొద్దిగా మార్పులు, చేర్పులతో సమతుల్యంగా మలచుకోవచ్చు. సమ తుల్య ఆహారం కన్నా ఆరోగ్యకరమైనదీ, పుష్టికరమైనదీ సాధారణ శ్రమ చేస్తూ జీవనం సాగించే వారికి ఈ విధమైన ఆహారం సమతుల్యంగా ఉండవచ్చు.ఇందుకోసం నిపుణులు అందిస్తున్న పంచ సూత్రాలను చూద్దామా...

**1.ఆహార ప్రణాళిక:**

డైట్ ప్లాన్ సరిగ్గా ఉండాలి కదా అని ఒకే తరహా ఆహారంతో సరిపెట్టేయకూడదు. దీని వల్ల ఆ ప్రణాళిక సవ్యంగా నడవదు. కొన్ని రకాల పదార్థాలు మరికొన్నింటితో కలిపితే రుచిగానే కాదు, ఆరోగ్యానికీ మేలు కలుగుతుంది. అయితే, ఏ పదార్థాలు కలిపితే శరీరానికి మంచిది అనేవి తెలిసుండటం ముఖ్యం. ఉదాహరణకి- చేపలు ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని చాలామందికి తెలుసు. అయితే, చేపలను కూరల రూపకంగానే కాకుండా ఆవిరి మీద ఉడికించి, గ్రిల్ చేసి, ఇతర కూరగాయల సలాడ్స్‌తో తీసుకోవచ్చు.

**2.ఎంపిక ప్రధానం:**

లక్ష్యం వైపుగానే ఆహారపు అలవాట్లు ఉండాలి. మనకు నచ్చనిదె%నా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని కూడా మెల్ల మెల్లగా మొదలుపెట్టి శరీరానికి అలవాటు చేయవచ్చు. దీని వల్ల లక్ష్యానికి త్వరగా చేరువకావచ్చు.

**3.భాగస్వామి ఎంపిక:**

కుటుంబంలోనో, స్నేహితుల్లోనో, సహోద్యోగుల్లోనూ.. మీలాగే ఆహారనియమాలు పాటించే వ్యక్తిని ఈ నియమాల్లో భాగస్వామిగా ఎంచుకోండి. దీని వల్ల ఆహార నియమాలను పాటించడంలో ప్రోత్సాహం ఉంటుంది. వాయిదా వేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. వాయిదా వేసినా తిరిగి కొనసాగించే ధోరణి ఈ పద్ధతిలో ఎక్కువ.

**4.కితాబు ఇచ్చేసుకోకండి:**

మీకు మీరుగా నేను చాలా బాగా ఆహార నియమాలు పాటించగలనుఅనే కితాబు ముందే ఇచ్చుకోకండి. ఎప్పుడె%నా నియమాలకు విరుద్ధంగా ఉన్నప్పుడు మిమ్మల్ని మీరు తిట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ విధానం వల్ల మీ ప్రణాళిక కూడా పూర్తిగా మూలన పడే అవకాశమూ ఉంది. అందుకే, ప్రతి రోజూ ఈరోజును కొత్తగా, ఇంకా మరింత ఆరోగ్యకరమైన ఆహార నియమాలతో ప్రారంభిస్తాను అనుకోండి.

**5.ఒత్తిడిని అదుపులో ఉంచండి:**

భావోద్వేగాల ప్రభావం ఆరోగ్యం మీద చూపుతుంది. ఇలాంటి సమయాల్లో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, లేదా అసలు తీసుకోకపోవడం జరుగుతుంటుంది. మానసిక ఒత్తిడి అదుపులో లేకపోతే ఆహారం మీద అదుపు ఉండదు. అనారోగ్యకరమె%న ఆహారం మరింత మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇదొక విషవలయంగా మనిషిని వేధిస్తూనే ఉంటుంది. అందుకని మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకొని, నియమాల అమలు సక్రమంగా జరిగేలా చూడాలి.

**సమతుల్య ఆహారం:**

1. బియ్యం - 520 గ్రా, 2. పప్పుధాన్యాలు - 50గ్రా 3. ఆకుకూరలు - 40గ్రా, 4. కూరగాయలు - 70 గ్రా, 5. దుంపలు - 60 గ్రా, 6.పాలు - 200 గ్రా, 7. నూనెలు - 45 మి.లీ, 8. చక్కెర, బెల్లం - 35 గ్రా. అయితే -న్యూట్రీషన్ మన ఆరోగ్యానికి సరిపోయే సమగ్ర ఆహారం సూచిస్తారు.

పప్పు ధాన్యాలకు బదులుగా రెండుకోడి గ్రుడ్లు లేదా 50 గ్రాముల మాంసం, చేప సమానపోషక విలువలు కలిగి వుంటాయి. కొద్దిగా మార్పులతో ఈ రకమైన పాళ్ళఆహారం తీసుకుంటే అది సమతుల్య ఆహారానికి దగ్గరగా వుంటుంది. సమతుల్య ఆహారంలోకి వివిధ అంశాల పోషక విలువలు తెలుసుకోవలసిన అవసరం చాలా వుంది.

**ఆకుకూరలు - కూరగాయలు:**


సమతుల్యఆహారంలో ఇవి అత్యంత విలువైన భాగాలు. పచ్చ టి తాజా ఆకుకూరల్లో, కూరగాయల్లో బి, సి, కె. విటమిన్లు, ఇను ము, కాల్షియం తదితరాలు పుష్కలంగా వుంటాయి. వీటి లో ప్రొటీన్లు, పిండి పదార్థాలూ, కొవ్వులు ఉండవు. అ యితే ఆకుకూరల్లో వుండే పీచుపదార్థం ఆరోగ్య పరిరక్షణలో ము ఖ్యమె%న పాత్ర వహిస్తుంది. అవసరానికి మించి లావుగా వున్నవాళ్లు తమ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయల్ని ఎక్కువచేయడం ద్వారా ఆహారాన్ని క్రమబద్ధం చేసుకోవచ్చు.



# చిన్నారుల్లో డిప్రెషన్

ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.




# కేన్సర్‌ను జయిద్దాం!

కేన్సర్‌పై అవగాహన పెంచి, ఆ మహమ్మారిని నియంత్రించి, సత్వర చికిత్స తీసుకునేందుకు యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ కేన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) ఒక రోజును కేటాయించింది. అదే.. అంతర్జాతీయ కేన్సర్ దినం.. ఫిబ్రవరి 4!! 2020 నాటికల్లా.. కేన్సర్ కేసులను, మరణాలను గణనీయంగా తగ్గించడమే ఈ రోజు ముఖ్యోద్దేశం. కేన్సర్.. ఒకప్పుడు అరుదుగా ఎక్కడో ఎవరికో వచ్చేది! కానీ ఇప్పుడు ఏ కేన్సర్ ఆస్పత్రిలో చూసినా రోగులు కిక్కిరిసిపోయి కనిపిస్తున్నారు! మారుతున్న జీవనశైలి.. పొగాకు వినియోగం.. అసహజ శృంగారం.. ప్లాస్టిక్ వినియోగం.. కారణాలేవైనాగానీ, కేన్సర్ కేసుల సంఖ్య ఏటికేడాదీ ఆందోళనకరస్థాయిలో పెరుగుతోంది. ఈ దేశం ఆ దేశం అనే తేడా లేదు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉంది. గణాంకాలే ఇందుకు రుజువు. 2013లో సగటున ప్రతి పదిలక్షల మందిలో 700 మంది కేన్సర్ బారిన పడగా.. 2015నాటికి ఈ సంఖ్య సగటున 1000కి చేరుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారమే.. 2015లో ఒక్క భారతలోనే 7 లక్షల మంది కేన్సర్‌కు బలయ్యారు. వైద్య రంగంలో ఎంతో పురోగతి సాధించినా.. కేన్సర్ మరణాల ఉద్ధృతిని ఆపలేకపోతుండటం విషాదం. కేన్సర్‌ను ఎదుర్కోవడంలో ఇన్నాళ్లుగా అనుసరిస్తున్న వైఖరే ఇందుకు కారణమని కొందరు వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేన్సర్ వచ్చాక దాన్ని నయం చేయడంపై దృష్టి పెట్టడం వల్ల ఉపయోగం ఉండదని.. దాని వల్ల మరణాల రేటు తగ్గదని, చికిత్స కన్నా కేన్సర్ రాకుండా నివారించే పద్ధతులను లేదా తొలిదశల్లోనే గుర్తించి, సమర్థమైన చికిత్సనందించే విధానాన్ని అనుసరించడమే మేలని వారు సూచిస్తున్నారు. తొలిదశల్లోనే కేన్సర్‌ను గుర్తించేందుకు మారుమూల పల్లెల్లో సైతం కేన్సర్ స్క్రీనింగ్ పద్ధతులను.. అది కూడా తక్కువ ధరల్లో అందరికీ అందుబాటులోకి తేవాలని, ఆ పరీక్షలను అందరూ ఎప్పటికప్పుడు చేయించుకునేలా చూడాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. కేన్సర్ నివారణకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో సంయుక్తంగా కృషి చేస్తే మంచిదని సలహా ఇస్తున్నారు. ఈమేరకు.. కేన్సర్‌ను తొలిదశల్లోనే గుర్తించి, చికిత్స చేయించడానికి కేంద్రం వచ్చే ఐదేళ్ల కాలానికిగాను రూ.15,855 కోట్లు కేటాయించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా తమ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంది. ప్రాథమిక స్థాయి కేన్సర్ కేర్‌కు సంబంధించి ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు క్రాస్ సబ్సిడీ మోడళ్లను పరిశీలిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా కేన్సర్ నివారణపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇక.. ఈ కేన్సర్ స్క్రీనింగ్ వ్యవస్థలను ప్రజలు వినియోగించుకొనేలా చేయడం కూడా సవాల్‌తో కూడుకున్న పనే. ఉదాహరణకు రొమ్ము కేన్సర్‌నే తీసుకుంటే.. భారతలో దీని బారిన పడుతున్నవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఒక్క 2013లోనే 47,587 మంది ఈ కేన్సర్ బారిన పడి మరణించారు. నిజానికి రొమ్ము కేన్సర్ స్టేజ్ జీరో నుంచి ప్రాణాంతస్థాయికి చేరుకోవడానికి 8 నుంచి 10 సంవత్సరాలు పడుతుంది. ముందే గుర్తిస్తే ప్రాణాపాయమే ఉండదు. శస్త్రచికిత్స అవసరమూ ఉండదు. కానీ, చాలామంది మహిళలు స్క్రీనింగ్‌కు రావడానికి ఇష్టపడరు. తొలిదశల్లోనే గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదనే విషయాన్ని వారికి బాగా తెలిసేలా చెప్పగలిగితేనే ఫలితం ఉంటుంది. పైగా.. కుటుంబంలో ఎవరైనా కేన్సర్ బారిన పడితే ఆర్థికభారం కూడా భరించలేని స్థాయిలో ఉంటుంది. సగటు మధ్యతరగతి భారతీయ కుటుంబాల వార్షికాదాయం కన్నా 20 రెట్ల దాకా కేన్సర్ చికిత్సకు ఖర్చవుతుంది. అదే తొలిదశల్లోనే గుర్తిస్తే ఆర్థిక భారం కూడా తగ్గే అవకాశం ఉంది. అందుకే చాలా పాశ్చాత్యదేశాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నాయి. మనదేశంలోనూ ప్రభుత్వాలు ఈ రెండిటిపైనా (స్క్రీనింగ్, ప్రజలు స్క్రీనింగ్ కేంద్రాలకు వచ్చేలా చేయడం) దృష్టి సారిస్తే కేన్సర్‌ను చాలా వరకూ జయించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**భారతలో ప్రతియేటా 3.5 లక్షల కేన్సర్ మరణాలు**

న్యూఢిల్లీ: భారతలో గుండె సంబంధిత వ్యాధుల కారణంగా సంభవిస్తున్న మరణాల తర్వాత రెండో స్థానం కేన్సర్ మరణాలదేనట! ప్రతియేటా మనదేశంలో మూడున్నర లక్షల మంది కేన్సర్‌తో మరణిస్తున్నారని ఇండియన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ రీసెర్చ్ (ఐఎస్‌సీఆర్) వెల్లడించింది. 2015కు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదికను ఉటంకిస్తూ.. దేశంలో ప్రతి ఏడాది ఏడు లక్షల కొత్త కేన్సర్ కేసులు నమోదవుతున్నాయని పేర్కొంది. కేన్సర్ ద్వారా మరణాలు రానున్న 10-15 ఏళ్లలో మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

**వీటితో తస్మాత్ జాగ్రత్త**

ఊబకాయ బాధితులు, మద్యపానం, ధూమపానం చేసేవారు, రసాయన ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు కేన్సర్ బారిన పడే ప్రమాదం ఎక్కువని వైద్యనిపుణులు చెబుతున్నారు. వారి ప్రకారం..

అధిక బరువుతో బాధపడేవారిలో పేగు, క్లోమ కేన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ.

మద్యపానం చేసేవారికి నోటి, గొంతు కేన్సర్లు వచ్చే ముప్పు అధికం.

ధూమపానం చేసేవారికి నోటి, గొంతు కేన్సర్లతోపాటు ఊపిరితిత్తుల కేన్సర్, మరిన్ని రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. రసాయన ఫ్యాక్టరీల్లో పనిచేసేవారికి ప్రధానంగా మూత్రాశయ కేన్సర్, ఇతర కేన్సర్లు వచ్చే ముప్పు ఎక్కువ.




# మలబద్ధకం సమస్యకు అసలైన కారణం ఈ ఆహారాలే...

ప్రస్తుత రోజుల్లో చాలా మంది మలబద్దక సమస్యతో బాధపడుతున్నారు . మలబద్దం వల్ల దీర్ఘకాలంలో చాలా సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుంది. మలబద్దక సమస్యకు ప్రధాణ కారణం పౌష్టికాహార లోపం, మరియు ఒత్తిడి. ఈ సమస్యను నివారించు కోవడానికి కొన్ని ప్రత్యేకమైన ఆహారాలున్నాయి. వీటిని రెగ్యులర్ డైట్ లో చేర్చుకోవడం మంచిది. మలబద్దకం దీర్ఘకాలిక సమస్యగా మారినప్పుడు, డాక్టర్ ను సంప్రదించడం చాలా మంచిది మరియు డాక్టర్ ను కలవడం వల్ల డైజెస్టివ్ సమస్యను డయోగ్నోస్డ్ సమస్యను నివారించుకోవచ్చు. మలబద్దకం సమస్య ను నేచురల్ గా తగ్గించుకోవడానికి మనం రెగ్యులర్ గా తీసుకొనే ఆహారాల్లో ఫైబర్ ఎక్కువ ఉన్న (పండ్లు మరియు కూరలను) చేర్చుకోవాలి. ఇవి మలబద్దక సమస్యను నివారించంచడంలో గ్రేట్ గా సహాయపడు తాయి . ఇవి బౌల్ మీద ఒత్తిడి పెంచి తిన్న ఆహారం స్మూత్ గా జీర్ణం అయ్యేందుకు మరియు విసర్జనకు సహాయపడుతాయి . ఎక్కువగా ద్రవాలున్న ఆహారాలు మరియు పానీయాలు తీసుకోవడం వల్ల బౌల్ మూమెంట్ కు సహాయపడుతాయి. బౌల్ మూమెంట్ ప్రొసెస్ లో మన శరీరంలోని వివిధ రకాల టాక్సిన్స్ మరియు వేస్ట్ ప్రొడక్ట్స్ తొలగింపబడుతుంది. అందు వల్ల అలా వేస్ట్ ప్రొడక్ట్స్ మన శరీరం నుండి ప్రతి రోజూ బయటకు విసర్జించకుండా నిలుపుదల జరిగినప్పుడు ఆరోగ్యపరంగా వివిధ రకాల సమస్యలను ఎదుర్కోవల్సి వస్తుంది. మలబద్దకంను నివారించే నేచురల్ అండ్ హెల్తీ ఫుడ్స్ మలబద్ద సమస్య నివారించుకోవడానికి కొంత మంది తక్షణ ఉపశమనం పొందడానికి కొన్ని మందులను వాడుతుంటారు, అవి విరేచనాలకు దారితీస్తాయి. మలబ్దక సమస్యను ప్రస్తుతానికి నివారించినా, వాటికి మీరు వ్యసన పరులుగా మారుతారు . కాబట్టి, అలా మందులతో అనారోగ్య సమస్యలకు గురి కాకుండా చాలా సున్నితంగా మలబద్దక సమస్యను నివారించుకోవడం కోసం మలబద్దకాని కారణం అయ్యే కొన్ని ఆహారాలను లిస్ట్ ను క్రింది విధంగా సూచించండం జరిగింది. వీటికి దూరంగా ఉన్నట్లైతే మలబద్దక సమస్యను నివారించుకోవచ్చు.

**బ్రెడ్:** వీట్ అండ్ బార్లీ బ్రెడ్ తో తయారుచేసిన బ్రెడ్. వీటిలో ఫ్రక్టాన్స్ మరియు గ్లూటెన్లు అధికంగా ఉంటాయి. చాలా మందిలో ఈ గ్లూటెన్స్ మరియు ఫ్రక్టాన్స్ జీర్ణం అవ్వకుండా శరీరంలోకి షోషింపకుండా ఉంటాయి. తర్వాత ఇది జీర్ణం కాకకపోతే పొట్టలో బ్యాక్టీరియా ఏర్పడే ప్రమాధం ఉంది. దాంతో పొట్టలలో గ్యాస్, పొట్ట ఉదరంలో నొప్పి, అసౌకర్యం మరియు ఇతర బౌల్ మూమెంట్ లక్షణాలు కలిగి ఉంటాయి .

**రెడ్ మీట్:** రెడ్ మీట్ ఒక్కటీ మలబద్దకానికి కారణం కావకపోవచ్చు భోజనంతో పాటు రెడ్ మీట్ తీసుకొన్నప్పుడు మీరు వెజిటేబుల్స్ ను తినకుండా ఉండటం వల్ల జీర్ణక్రియకు కష్ట అవుతుంది . కాబట్టి రెడ్ మీట్ తీసుకొన్న మంచి ఆహారం తీసుకోవడం మంచిది. మాంసాహారం తీసుకొన్న సలాడ్స్ మరియు బేక్ చేసిన బంగాళదుంపలు తీసుకోవడం మర్చి పోకండి.

కుక్కీస్(పాస్ట్రీస్ మరియు కేక్స్) వీటిని రీఫైడ్ ఫ్లోర్ తో తయారుచేస్తారు ఇవి మలబద్దకానికి కారణం అవుతాయి . ఈ ఆహారాలు గౌట్ ఆరోగ్యానికి అంత మంచివి కావు. కాబట్టి ఇలాంటి ఆహారాలను అకేషనల్ గా తీసుకోవాలి. రెగ్యులర్ గా తీసుకోకూడదు.

**పండని పచ్చి అరటిపండ్లు:** పండని పచ్చి అరటిపండ్లు తినడం వల్ల మలబద్దకానికి గురి చేస్తుంది. బాగా పండిన అరటిపండ్లలో న్యూట్రీషి యన్స్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మలబద్దక నివారణకు బాగా పండిన అరటిపండ్లను తీసుకోవాలి.

**చిప్స్** : బంగాళదుంప చిప్స్ లో ఫైబర్ తక్కువగా ఉంటుంది మరియు మీ పొట్టను చాలా త్వరగా ఫిల్ చేస్తుంది. అందువల్ల మీరు రెగ్యులర్ గా తీసుకొనే నార్మల్ మీల్స్ (పండ్లు మరియు కూరగాయల) ను తినకుండా మానేస్తుంటారు. పొటాటలో చిప్స్ ఎక్కువగా తినడం వల్ల మలబద్దకానికి గురి చేస్తుంది.

**చాక్లెట్:** డార్క్ చాక్లెట్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు , కానీ మోతాదుకు మించి తీసుకోవడం వల్ల మలబద్దకానికి గురిచేస్తుంది. ప్రేగుయొక్క సంకోచవ్యాచాలను అంతరాయం కలిగిస్తుంది. ఎక్కువ చాక్లెట్స్ తినడం వల్ల మలబద్దకం దారితీస్తుంది.

డైరీ ప్రొడక్ట్స్ డైరీ ప్రొడక్ట్స్ లో చీజ్ మరియు ఇతర లోఫ్యాట్ డైరీప్రొడక్ట్స్ లో ఫైబర్ తక్కువగా ఉంటుంది మరియు ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఆహారాలు జీర్ణక్రియను తగ్గించి మలబద్దకానికి గురి చేస్తాయి . కాబట్టి మీ రెగ్యులర్ డైట్ లో వెజిటేబుల్ లేదా ఫ్రూట్ సలాడ్స్ ను చేర్చుకోవాలి.

## ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు



**మనం** నిద్రించే తీరు మన జీవితంలో ఆనందాన్ని నిర్దేశిస్తుందంటున్నారు తాజా పరిశోధకులు. కుడి వైపు కన్నా ఎడమవైపు ఒత్తిగిలి నిద్రించే వారికి మానసిక ప్రశాంతత ఎక్కువగా ఉంటుందని, వారి జీవితం ఆనందమయంగా ఉంటుందని ఆ సర్వేలో తేలింది. ఎడమవైపు తిరిగి పడుకునే వారు రాత్రుళ్లు సాధారణంగా నిద్రలేవరట. వారికి చక్కని గాఢనిద్ర పడుతుందని ఆ సర్వే నివేదిక చెబుతోంది. కుడి వైపు తిరిగి పడుకునే వారి వదనం కళావిహీనంగా ఉంటుంది. అదే ఎడమవైపు పడుకునే వారి ముఖం ప్రకాశవంతంగా ఉంటుందట.

కుడివైపు పడుకునే వారు ఉదయం నిద్రలేవడంతోనే చికాకుగా ఉంటారట. అలాగే ఆఫీసులో కూడా వారు అశాంతిగా ఉండి ఉద్యోగంపై దృష్టిని నిమగ్నం చేయలేరట. అయితే ఎడమవైపు పడుకునే వారు ఆఫీసులో సంతోషంగా పనిచేస్తారు కాని కుడివైపు వారే బాగా గడిస్తారని ఈ సర్వే తేల్చింది. అలాగే కుడివైపు పడుకునేవారికి ఉద్యోగ జీవితం నచ్చదట.

కాని ఎడమవైపు నిద్రించే వారు తాము చేస్తున్న ఉద్యోగాన్ని ప్రేమిస్తారట. ఎడమ పక్క తిరికి పడుకునే వారు ఎంతటి గడ్డు పరిస్థితిలో అయినా నిబ్బరంగా ఉంటారట.

అదే కుడివైపు పడుకునే వారు ఏ చిన్న కష్టం వచ్చినా కలవరపాటుకు గురై మానసికంగా కుంగిపోతారట. ఎడమవైపు పడుకునే వారు ఎప్పుడు ఉల్లాసంగా ఉండటమే కాక ఆశావాద దృక్పథంతో జీవిస్తారట.

రాత్రుల్లో ఖచ్చితంగా 8 గంటలు నిద్రపోవడానికి గల కారణాలు ఎడమ వైపు తిరిగి పడుకొనే వారు అనేక వ్యాధులను నివారించుకొనే శక్తి కలిగి ఉంటారు. ముఖ్యంగా, గుండె సంబంధిత సమస్యలు, అలసట, బౌల్ మూమెంట్, మరిన్ని ఇతర సమస్యలను కలిగి ఉంటారు. కాబట్టి, మీ శరీరానికి విశ్రాంతి, మనస్సుతి కలిగి ఉండుటకు ఎడమవైపు తిరిగి పడుకోవడం చాలా ముఖ్యం. ఈ ఆర్టికల్ చదివిన తర్వాత ఎడమైపు తిరిగి నిద్రించడం ఎంత అవసరం, ముఖ్యమో మీరు గుర్తిస్తారు. ఎడమవైపు కాకుండా మరే ఇతర భంగిమలో పడుకొన్నా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవల్సి వస్తుంది.

నిద్ర గురించి మీకు తెలియని 12 వాస్తవాలు కుడివైపు తిరిగి పడుకోవడం వల్ల శరీరంలో టాక్సిన్స్ భయటకు నెట్టయేబడదు. దాంతో గుండె పనితీరు మీద మరింత ఒత్తిడి పెగుతుంది. మరియు జీర్ణ సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. వెల్లకిలా పడుకోవడం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయి.

ఇది ఆస్తామా మరియు నిద్రలేమి వారికి చాలా ప్రమాధకరమైనది. అధిక నిద్ర వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్.! నివారణ ఎలా? కాబట్టి, ఎడమవైపు తిరిగి నిద్రించడం చాలా ముఖ్యం. అలాగే మన శరీరానికి కూడా ట్రైన్ ఇవ్వాలి. మరి ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలేంటో ఒకసారి క్రింది స్లైడ్ ద్వారా తెలుసుకుందాం...

**తీవ్ర ఆరోగ్య ప్రమాదాలను నివారించుకోవచ్చు:** ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల శరీరంలో టాక్సిన్స్ ను తొలగించడానికి సులభం అవుతుంది. దాంతో అన్ని రకాల ప్రమాధకర జబ్బును నివారించుకోవచ్చు. ఎడమవైపు తిరిగిపడుకోవడం వల్ల శోషరసాలు ఎక్కువగా విడుదలయ్యే శరీరంలో టాక్సిన్స్ ను తొలగించడానికి సహాయపడుతాయి.

**లివర్ మరియు కిడ్నీల పనితీరు మెరుగ్గా ఉంటుంది:** మన నిద్రించే సమయంలో కూడా కాలేయం మరియు కిడ్నీలు మరింత మెరుగ్గా పనిచేయడానికి, శరీరంలో వేస్ట్ ప్రొడక్ట్స్ ను మరియు టాక్సిన్స్ ను తొలగించడానికి ఈ నిద్రాభంగిమ సహాయపడుతుంది.

శరీరంలోని అవయా వాల నుండి వేస్ట్ ను ఎడమవైపు చాలా ఎఫెక్టివ్ గా గ్రహిస్తుంది. దాంతో శరీరం శుభ్ర పడుతుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:** ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల పొట్ట మరియు ప్రొక్రియాటిక్స్ నేచురల్ గా హ్యాంగ్ అవుతాయి. ఇది తిన్న ఆహారం మరింత ఎఫెక్టివ్ గా జీర్ణం అవ్వడానికి సహాయపడుతుంది.

**సున్నితమైన బౌల్ మూమెంట్:** ఎడమవైపు నిద్రలో ఉన్నప్పుడు, చిన్న ప్రేగుల నుండి పెద్దప్రేవుల్లోకి గ్రావిటి ద్వారా నెట్టడానికి సహాయపడుతుంది. ఇది పొట్టలోని వ్యర్థాలను ఉదయం చాలా మృదువుగా తొలగింపుకు సహాయపడుతుంది.

**హార్ట్ ఫంక్షన్ మెరుగుపరుస్తుంది:** ఎడమ వైపు నిద్రించడం వల్ల గురుత్వాకర్షణ సహాయంతో శరీరభాగాలన్నింటికి రక్తసరఫరా జరిగి, గుండె మీద పనిభారం తగ్గిస్తుంది.

**ఉదయం అలసటను తగ్గిస్తుంది:** ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల లివర్ మరియు గాల్ బ్లాడర్ ఫ్రీగా హ్యాంగ్ అయ్యి పిత్యరసాలు వేస్ట్ కాకుండా, స్వేచ్ఛగా ఉత్పత్తి అయ్యేందుకు సహాయపడు తాయి. తీసుకొన్న ఆహారం చాలా సున్నితంగా జీర్ణం అవ్వడానికి సహాయపడుతుంది.

**ఫ్యాట్స్ కరింగించి, ఫ్యాటీ లివర్ ను నివారిస్తుంది:** కాలేయం మరియు పిత్తాశయం నుండి స్రవించి పిత్త రసాలు తరళీకరణ ప్రక్రియ ద్వారా కొవ్వులు జీర్ణం అవుతాయిని మనందరికీ తెలిసిన విషయమే. అయితే ఎడమవైపు నిద్ర మరింత పైత్య స్రావంకు సహాయపడు తుంది కొవ్వులు జీర్ణమవ్వడానికి సహాయపడుతుంది. దాంతో అదనపు కొవ్వులు కాలేయంలో పేరుకోకుండా నిరోధిస్తుంది.

# హెపటైటిస్-బి.. చికిత్స

**హెపటైటిస్-**

సి ఇన్ఫెక్షన్పై శరీరం దానంతటదే పోరాడితే తప్ప, ఇది 15 శాతం కేసుల్లో జరుగుతుంది. దీర్ఘకాలిక హెపటైటిస్-సిని నియంత్రించడానికి చికిత్స అవసరం రావచ్చు. కొన్నిసార్లు చికిత్స పనిచేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. మరియు కొన్నిసార్లు ఇది సహాయపడకపోవచ్చు. అప్పటికప్పుడే ఈ వ్యాధి ముమ్మరం కాదు కాబట్టి, మీ డాక్టరు నుంచి చికిత్స మరియు సంరక్షణ పొందడం ముఖ్యం. రక్తంలో వైరస్ పరిమాణాన్ని తగ్గించడం మరియు సిరోసిస్, అంత్య దశ కాలేయం వ్యాధి. మరియు ఇతర జటిల సమస్యలను నిరోధించేందుకు వ్యాధి పురోగతిని నెమ్మదింపజేయడం దీర్ఘకాలిక హెపటైటిస్ సి యొక్కలక్ష్యం.ల దీర్ఘకాలిక హెపటైటిస్-సికి చికిత్స చేసేందుకు ప్రస్తుతం లభిస్తున్న థెరపీలన్నీ అల్ఫా ఇంటర్ఫెరావ్లు అనే బయోలోజిక్ ఏజెంట్లు పనిచేయడంపై ఆధారపడి ఉంటాయి. ఇంటర్ఫెరాన్ లు అనేవి మన శరీరంచే సహజంగా ఉత్పత్తి చేయబడే ప్రొటీన్లు. ఇవి మానవ తయారీవి అయి కూడా ఉండొ చ్చు. మరియు ప్రజలకు ఇంటర్ఫెరాన్ యొక్క పరిస రాలను పెంచేందుకు ఇవి వాళ్ళకు ఇంజెక్షన్ ద్వారా ఇవ్వబడతాయి. ఇంటర్ ఫెరాన్ని సబ్కుటేనివస్గా (అంటే చర్మం కిందకి అని అర్థం) ఇంజెక్ట్ చేయవల సిన అవసరం వుంది.

**హెపటైటిస్-సికి టీకాల విరుగుడు:** దీర్ఘకాలిక హెపటైటిస్-సిలో లక్షణాలు ఈ విధంగా ఉంటాయ. రక్తంలో వైరస్, యాంటీబాడీలు లేవు, వైరస్ని ఇతరులకు సంక్రమింపజేయగలరు. కాలేయం పాడైపోవడం కొనసాగుతుంది. కాలేయ వైఫల్యం, వ్యాక్సినేషన్. వ్యాక్సిన్ అనేది మీకు సుస్తీ చేయకుండా ఉంచేందుకు మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడు తీసుకునే ఔషధం. హైపటైటిస్-బి వైరస్ లాంటి కొన్ని వైరస్లపై దాడి చేయాలని వాక్సిన్లు మీ శరీరానికి సూచిస్తాయి. హెపటైటిస్-బి వ్యాక్సిన్ మూడు షాట్లుగా ఇవ్వబడు తుంది. పాపాయిలందరికీ తప్పకుండా వ్యాక్సిన్ని ఇవ్వాలి. పాపాయిలు పుట్టిన తరువాత 12 గంటల లోపు మొదటి షాట్ ఇవ్వాలి. రెండో షాట్ని 1 నుండి 2 నెలల వయసుకు మరియు మూడో షాట్ని 6 మరియు 18 నెలల వయస్సులోనూ ఇవ్వాలి. పెద్ద పిల్లలు మరియు వయోజనులు కూడా వ్యాక్సిన్ని పొందవచ్చు. వీళ్ళు మూడు షాట్లను ఆరు రోజుల్లో తీసుకోవాలి. వ్యాక్సిన్ తీసుకోకుండా ఉన్న పిల్లలు దీన్ని తీసుకోవాలి. మీరు షాట్లన్నిటినీ పరిరక్షించవలసిన అవసరం వుంటుంది. మీరు విదేశాలకు వెళ్ళేటట్ల యితే, మీరు వెళ్ళబోయే ముందే షాట్లన్నిటినీ తీసు కునేలా చూడాలి.

**సురక్షిత చిట్కాలు:** ఔషధాలు, హార్మోన్లు, స్టెరాయిడ్లు మరియు విటమిన్లు ఎక్కించుకునేందుకు ఒకరు వాడిన సూదులను మరొకరు వాడకూడదు. ఇంజెక్షన్ చేసు కోవడానికి ముందు చేతులు కడుక్కోవాలి. కండోమ్లు మరియు బ్యారియర్లు ఉపయోగించడం లైంగిక జబ్బులు సంక్రమించే అపాయాలను తగ్గించడానికి సహాయపడుతుంది. అయితే హెపటైటిస్-బి రోగులతో పోల్చుకుంటే హెపటైటిస్-సి రోగుల్లో సంక్రమణ అపాయం చాలా తక్కువగా ఉంటుంది. గర్భధారణ కాలంలో లేదా బిడ్డ పుట్టిన సమయంలో హెపటైటిస్-బి తల్లి తన పాపాయికి సంక్రమింపజేయవచ్చు. కాబట్టి గర్భం దాల్చటానికి ముందు మీ డాక్టరును సంప్రదించండి. హెపటైటిస్-సితో ఇది చాలా తరచుగా కలగదు. ఆరోగ్య సంరక్షణ సెట్టింగుల్లో ప్రామాణిక సురక్షిత ముందుజాగ్రత్తలు జాగ్రత్తగా పాటించేలా నిర్ధారించు కోండి. రేజర్లు, టూత్బ్రష్లు, నెయిర్ కట్టర్లు లేదా గుచ్చుకునే చెవి పిన్నులు లాంటి వ్యక్తిగత పరిశుభ్రత వస్తువులను మరొకరితో పంచుకోవద్దు.

**హెపటైటిస్ - ఎ, బి ఎందుకొస్తాయి?** హెపటైటిస్ అనగా కాలేయానికి చెందిన వ్యాధి. ఇది వైరస్, బాక్టీరియా, ప్రొటోజావా, కొన్ని మందులు మొదలైన వివిధ కారణాలవలన కలుగుతుంది. వీనిలో వైరస్వల్ల కలిగే హెపటైటిస్ను వైరల్ హెపటైటిస్ అంటారు.

**హెపటైటిస్-ఎ:** (ఇన్ఫెక్షన్ హెపటైటిస్) హెపటై టిస్- ఎ వైరస్ ద్వారా వచ్చే లివర్ వ్యాధి. ఇది కలుషిత మైన నీటి ద్వారా లేక కలుషితమైన ఆహారం ద్వారా కానీ వ్యాప్తి చెందుతుంది. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తం గా పది మిలియన్ల ప్రజలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. రోగ క్రిమి శరీరంలో ప్రవేశించినప్పటి నుంచి రోగ లక్షణాలు మొదలయ్యే వరకు (ఇంక్యుబేషన్ పీరియడ్) సాధారణంగా, రెండు నుండి నాలుగు వారాల వరకు ఉంటుంది. హెపటైటిస్-ఎ టీకాతో ఈ వ్యాధిని నిరోధించవచ్చు.


**వ్యాధి పుట్టుక:** వ్యాధికారక క్రిమి గొంతు లేదా ప్రేవుల్లోని కణజాలాన్ని చొచ్చుకొని, రక్తం ద్వారా లివర్కు చేరి అక్కడ అభివృద్ధి చెందుతుంది.

**హెపటైటిస్-బి:** హెపటైటిస్-బి అనేది కాలేయానికి సంబంధించిన వ్యాధి. హెపటైటిస్-బి వైరస్ ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఈ వైరస్ హెపడ్నావైరస్ కుటుంబానికి చెందిన వందల రకాల వైరస్లలో ఇది ఒక రకం. దీనికి సీరం హెపటైటిస్ అని ఇంకో పేరుంది. ఈ వ్యాధి ఆసియా మరియు ఆఫ్రికా ఖండాలలో చాలా చోట్ల ప్రబలంగా వుంది. ఒంట్లో హెపటైటిస్ వైరస్ వున్న వాళ్ళు మన దేశంలో, మన ప్రాంతంలో చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. మొత్తం జనాభాలో వీరు 3-5 శాతం వరకూ వున్నట్టు అంచనాలు చెబుతున్నాయి. కాలేయానికి వాపురావటం, వాంతులు, పచ్చకామెర్లు ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి ముదిరితే కాలేయం గట్టిబడిపోయి లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం వుంది.

**వ్యాప్తి మరియు వ్యాధి లక్షణాలు..** ఒకసారి హెపటైటిస్-బి వైరస్ ఒంట్లో ప్రవేశించిందంటే ఒంట్లో దాని సంఖ్య విపరీతంగా లక్షల్లో పెరిగిపోతూ అది లివర్ను దెబ్బతియ్యటం ఆరంభిస్తుంది. ఇక వాళ్ళ రక్తంలోనూ, వీర్యంలోనూ, లాలాజలంలోనూ, ఇతత్రతా శారీరక స్రావాలన్నింటిలోనూ ఈ వైరస్ ఉండవచ్చు. ఈ వైరస్ ఎక్కువగా శరీర ద్రవాల ద్వారా వ్యాపిస్తుంది. సెక్స్, రక్తమార్పిడి, సూదులు, సిరంజీలు, తల్లినుండి బిడ్డకు సంక్రమించవచ్చును.

**తొలిదశ:** హెపటైటిస్-బి వైరస్ శరీరంలో ప్రవేశించిన తర్వాత సాధారణంగా చాలామందికి కొద్ది రోజుల్లో కామెర్లు వస్తాయి. దీన్ని అక్యూట్ దశ అంటారు. కామెర్లతోపాటు వికారం, అన్నం సహించకపోవటం, కొద్దిపాటి జ్వరం వంటి లక్షణాలూ ఉండవచ్చు. ఈ దశలో మనం (హెచ్బిఎస్ ఎజి) పరీక్ష చేస్తే పాజిటివ్ వస్తుంది. అంటే ఏదో మార్గంలో హెపటైటిస్- బి వైరస్ వీరి శరీరంలో ప్రవేశించిందనీ, దాని కారణంగా కామెర్లు వచ్చాయని అర్థం. వీరికి లివర్ ఫంక్షన్ టెస్టుల్లో కూడా కాస్త తేడాలుంటాయి.

# కళ్లకు వ్యాయామం తప్పనిసరి



**రోజంతా** ఆఫీసులో కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేయడం, ఇంటికి వచ్చాక టీవీకి అతుక్కుపోవడం లేదా ల్యాప్టాప్ ముందుకు కూర్చునే వారి సంఖ్య ఎక్కువే. అయితే ఈ విధంగా గంటల తరబడి కంప్యూటర్లు, టీవీల ముందు కూర్చోవడం వలన చిన్న వయసులోనే కళ్ల సమస్యలు ఏర్పడతాయి. కంప్యూటర్ నుంచి వెలువడే పవర్ వలన కళ్ల చూపు మందగించే ప్రమాదం ఉంది. కనుక కళ్ల కోసం కొంత టైమ్ కేటాయించాలి.

కళ్ల సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే కళ్లకు అప్పుడప్పుడు కాస్తంత విశ్రాంతిని ఇస్తూ, చిన్న పాట వ్యాయామాలు చేయడం మంచిది. అవి ఎలా చేయాలో మీ కోసం. రెండు అరచేతుల్ని కలిపి రుద్దితే కొన్ని నిమిషాలకు వేడెక్కుతాయి. వాటిని కళ్లపై ఉంచండి. ఇలా చేస్తున్నప్పుడు కళ్లు తెరవకూడదు. కళ్లపై వెలుతురు పడకూడదు. ఇలా రోజులో కుదిరినప్పుడల్లా చేసి చూడండి. కళ్లకు హాయిగా అనిపిస్తుంది.

కంప్యూటరుపై పనిచేసే వారిలో చాలా మంచి కనీసం రెండు నిమిషాలు కూడా కళ్లు మూసి తెరవరు. దాంతో కళ్లు అలసిపోతుంటాయి. ఇలాంటి వారు తరచూ కనురెప్పల్ని మూసి తెరవడం ఓ అలవాటుగా మార్చుకోవాలి. ఇలా ఎన్ని ఎక్కువ సార్లు చేస్తే అంత మంచిది.

కంప్యూటరు ఎదురుగా కూర్చుని పనిచేసే వారు దూరంగా ఉండేవి చూడటంలో ఇబ్బందిపడతారు. దాన్ని అధిగమించాలంటే ప్రతి అర గంటకోసారి ఐదు సెకన్లు దూరంగా ఉండే వస్తువుల్ని చూడాలి. ఇది కళ్లకెంతో మేలు చేస్తుంది. ఇక కళ్లు బాగా అలసిపోయినట్లు అనిపిస్తుంటే, కాసిని నీళ్లు జిలకరించుకోండి. లేదా చన్నీళ్లతో కళ్లను తుడుచుకోండి. దీన్ని కళ్లపై ఉన్న ఒత్తిడిపోయి తాజాగా మారతాయి.

సౌకర్యంగా కూర్చుని చేతి బొటనవేలిని కంటికెదురుగా పెట్టుకుని దాన్న చూడాలి. తరువాత వేలిని దూరంగా ఉంచి మళ్లీ దృష్టిని దానిపై నిలపాలి. ఇలా కొన్ని నిమిషాలు చేస్తే కళ్లకు విశ్రాంతి లభిస్తుంది. ఈ విధంగా చేయడం వలన కళ్ల చూపు సమస్యలు దరిచేరవని వైద్య నిపుణులు తేల్చి చెబుతున్నారు.

# పరకడుపున లీటరు నీళ్లు తాగితే...?



**నేటి** ఆధునిక యుగంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, ప్రకృతిలో చోటుచేసుకున్న మార్పులతో పాటు పలు కారణాల వలన మనలను పలు రకాలైన అనారోగ్యాలు వెన్నంటే వుంటాయి. అయితే ఎటువంటి ఆరోగ్య సమస్యలలైనా ఆదిలోనే హరించే దివ్యౌషధం మంచి నీళ్లే అని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రతి రోజు ఉదయం పూట లీటరు మంచి నీళ్లు తాగితే పలు రోగాలు మటుమాయమవుతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.

కార్యాలయాల్లో ఉద్యోగస్తులు రోజుకు తొమ్మిది, పది గంటల పాటు ఒకే సీట్లో కూర్చుని పనిచేస్తుంటారు. అటువంటి వారి పొట్టలో మందం చేరి, జీర్ణశక్తి 0తగ్గిపోతుంది. వారు ప్రతి రోజు ఉదయాన్నే మంచి నీళ్లు తాగితే, ఆ నీళ్లు పొట్టను క్లీన్ చేయడమే కాకుండా జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి. ఉదయం పూట వ్యాయామం చేసే అలవాటు ఉన్న వాళ్లు చాలా ఎనర్జీ కోల్పోతుంటారు. అటువంటి వాళ్లకు ఒక లీటర్ మంచి నీళ్లు శరీరానికి ప్రొటీన్స్ బాగా అందేలా చూస్తాయి.

కోల్పోయిన ఎనర్జీని తిరిగి తెస్తాయి. అంతకాదండోయ్ రక్తంలోని మలినాలను తరిమికొడ తాయి. వాతావరణ కాలుష్యం కారణంగా పలువురి చర్మ డల్గా తయారవుతుంది. అటువంటి వారు క్రమం తప్పకుండా రోజు లీటరు నీళ్లు తాగితే చర్మ మెరిసిపోతుంది. మితి మీరి బరువు పెరిగిన వాళ్లు ప్రతి రోజు పరకడుపున మంచి నీళ్లు తాగితే బరువు అతి సులభంగా తగ్గిపోతారు. ముఖ్యంగా ఇటీవల అత్యధిక సంఖ్యలో పురుషులు ఎదుర్కునే సమస్య కిడ్నీలో రాళ్లు.

ఈ సమస్యకు అసలైన మందు మంచి నీళ్లే అని వైద్యు లు తెలుపుతున్నారు. రోజూ లీటర్ మంచి నీళ్లు తాగితే కిడ్నీలో రాళ్లు చేతులు. ఇంత టి మేలు చేసే మంచి నీళ్లను తాగడం ఎవరూ మరువకండి.

# ప్రజాసేవకు అంకితం కావాలి

**- ఎంపీ విజయ సాయి రెడ్డిని కలిసిన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు**



విశాఖపట్నం: ప్రజల అభీష్టం మేరకు నూతనంగా ఎన్నికైన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ లు నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవకు అంకితం కావాలని రాజ్యసభ సభ్యులు వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి సూచించారు. బుధవారం తిమ్మాపురం లోని అతిధి గృహంలో నర్సీపట్నం మునిసిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన వైకాపా కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పి. ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో విజయ సాయి రెడ్డిని కలిసిన 15 మంది కౌన్సిలర్లు. గెలుపొందిన కౌన్సిలర్లను అభినందించిన విజయసాయి రెడ్డి. నిరంతరం ప్రజా సేవకు అంకితం కావాలని, ఉన్నత మైన పని తీరుతో ప్రజల మనస్సులో స్థానం సుస్థిరం చేసుకోవాలని విజయ సాయిరెడ్డి సూచించారు..

# ప్రజలతోనే మమేకం అవ్వండి

**- 14వ వార్డు కార్పొరేటర్ ఘన విజయం సాధించిన కటారి అనిల్ కుమార్ రాజుకు ఎంపీ ఎం వి వి అభినందనలు**



ఎంవిపి కాలనీ : సుదీర్ఘకాలంపాటు తర్వాత జరిగినా గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ లంతా గ్రేట్ అభివృద్ధి కొరకు పాటుపడుతూ ప్రజలతోనే మమేకం కావాలని విశాఖ ఎం ఎం వి వి సత్యనారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ని గ్రేటర్ విశాఖ ఎన్నికల్లో 14వ వార్డు కార్పొరేటర్ గా విజయం సాధించిన కతారి అనిల్ కుమార్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా వేసి, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కార్పొరేటర్ గా విజయం సాధించిన అనిల్ కుమార్ రాజుకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ రాజు, సీనియర్ నాయకులు విశ్వనాధరాజు పాల్గొన్నారు..

# బోకం శ్రీనివాస్ ఆర్ధిక సహాయంతో పరదేశి మాంబ పండగ మహోత్సవం

సబ్బవరం: మండలంలో తవ్వవానిపాలెం గ్రామంలో బోకం శ్రీనివాస్ (నెంబర్ -9) వారి ఆర్ధిక సహాయంతో పరదేశి మాంబ పండగ మహోత్సవములు ఈ నెల 23వ తేదీన అంగరంగ వైభవంగా జరుగునని సర్పంచ్ బోకం సోమునాయుడు బుధవారం తెలిపారు ఈ మహోత్సవం సందర్భంగా ఈ క్రీడా పోటీలు జరుగునని జిల్లాస్థాయి మహిళా కబాడీ పోటీలు 17 తేదీన జరుగునని విజేతలకు ప్రధమ బహుమతి 10 వేలు రెండవ బహుమతి 8వేలు మూడవ బహుమతి 6వేలు నాల్గవ బహుమతి 4 వేలు జిల్లాస్థాయి కోకో 21వ తేదీన జరుగునని ప్రధమ బహుమతి 15 వేలు రెండవ బహుమతి 12 వేలు మూడవ బహుమతి 8 వేలు నాల్గవ బహుమతి 6 వేలు 22వ తేదీన వాలీ బాల్ పోటీలు జిల్లా స్థాయి జరుగునని ప్రధమ బహుమతి 15 వేలు రెండవ బహుమతి 10 వేలు మూడవ బహుమతి 8 వేలు నాల్గవ బహుమతి 5 వేలు 23 వ తేదీన మందుగుండు పోటీలు జరుగునని ప్రధమ బహుమతి 25 వేలు రెండవ బహిమతి 15 వేలు 23వ తేదీన గుర్రం పందేలు జరుగునని మంగళవారం రాత్రి M.L.A ఈవెంట్స్ M.K.L సౌండ్స్ వారి ఆధ్వర్యంలో డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించబడునని పండుగ రోజు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునని సినీ తారలు వస్తున్నారని తొలివేల్పు రోజున రామాంజనేయ యుద్ధం, గమోపాఖ్యాన నాటకం ప్రదర్శించబడునని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు,



ఉప సర్పంచ్ వనం వెంకట రమణ,బోకం కాసుబాబు,బోకం శ్రీనివాస్ యూత్ పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి మహిళా కబాడీ పోటీలు ప్రారంభం

**- ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బోకం సోము నాయుడు**



సబ్బవరం:మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో పరదేశిమాంబ పండగ పురష్కరించి కాని బుధవారం జిల్లా స్థాయి కబాడీ పోటీలకు బోకం శ్రీనివాస్ (నెంబర్-9) ఆర్ధిక సహాయంతో మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, సర్పంచ్ బోకం సోమునాయుడు కబాడీ పోటీలను ప్రారంభించారు ఈ పోటీలలో వివిధ గ్రామాల నుండి 15 ఎంపిక చేసిన మహిళా జట్లు పాల్గొన్నాయి ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, సర్పంచ్ బోకం సోమునాయుడు మాట్లాడుతూ క్రీడల వలన శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుంది అన్నారు పోటీతత్వం కలిగి ఎలాగ అయిన గెలవాలని పట్టుదల పెరుగుతుందని అన్నారు అంతేకాకుండా మన గ్రామానికి,మండలానికి,జిల్లాకి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని అన్నారు విజేతలకు ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ వనం వెంకట రమణ, బోకం కాసుబాబు,బోకం పాలవెల్లి, శ్రీనివాస్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు**

**మొదటిబహుమతి 10,000**
**రెండవ బహుమతి 8,000**
**మూడవ బహుమతి 6,000**
**నాల్గవ బహుమతి 4,000**

# గీతం వేదికగా బోసియా జాతీయ క్రీడలు ప్రారంభం



విశాఖపట్నం : శారీరక వైకల్యంకు ఎదురొడ్డి ఆత్మ విశ్వాసంతో క్రీడలలో రాణిస్తున్న యువ క్రీడాకారులను ప్రొత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆతిద్యంలో పారాబోసియా స్పోర్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 5వ బోసియా జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలు బుధవారం ప్రారంభం అయ్యాయి. గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్ ముఖ్యఅతిధిగా హజరై పోటీలను ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు పి.గణబాబు, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, బోసియా ఇండియా అధ్యక్షుడు జస్ప్రీత్ సింగ్ ధల్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివశంకర్, పారాఒలింపిక్స్ కమిటి అధ్యక్షురాలు దీపా మాలిక్, నిర్వాహక కార్యదర్శి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ పారా బోసియా క్రీడలు ప్రతి ఒక్కరులో స్పూర్తిని నింపుతాయన్నారు. అవరోధాలను అదిగమిస్తు విజయం వైపు నడవడం శారీరకంగా, మానసికంగా బలమైన వారికి మాత్రమే సాద్యమన్నారు. పారా బోసియా అధ్యక్షుడు జస్ప్రీత్ సింగ్ ధల్వాల్ మాట్లాడుతూ గీతంలో జరిగే జాతీయ క్రీడలలో ప్రతిభ చూపే వారని అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీలలో దేశంలోని వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఎంఆర్‌వో సేవల కోసం నూతన విధానం

న్యూఢిల్లీ : దేశంలో పెద్ద ఎత్తున విమాన మరమ్మతులను చేపట్టేందుకు వీలుగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నూతన విధానాన్ని ఆవిష్కరించినట్లు రాజ్యసభలో బుధవారం వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు. ఇప్పటి వరకు దేశంలో విమానాల మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో) సేవలు అరకొరగా మాత్రమే ఉండటానికి కారణాలను ఆయన వివరించారు. ఎంఆర్‌వో సేవలపై వసూలు చేసే అత్యధిక జీఎస్టీ, దేశంలో అంతర్జాతీయ ఆమోదం పొందిన మెయింటెన్స్ సౌకర్యాలు లేమి, విమానాలు లీజు అగ్రిమెంట్లలో ఉండే నిబంధనలు వంటి కారణాల వలన దేశంలో ఎంఆర్‌వో సేవంలు విస్తృతికి అవరోధంగా నిలిచాయని ఆయన చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది ఏప్రిల్ నుంచి ఎంఆర్‌వో సేవలపై విధిస్తున్నజీఎస్టీని హేతుబద్ధం చేయడం జరిగింది. ఏఏఐ ప్రవేశపెట్టిన నూతన ఎంఆర్‌వో విధానంతో రెండేళ్ళ ఈ రంగం పుంజుకుంటుందని ఆయన చెప్పారు. దేశంలో పౌర, సైనిక విమానాల మరమ్మతుల కోసం ఎంఆర్‌వో సేవలను ప్రవేశపెట్టేందుకు హెచ్ఏఎల్-ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ సంయుక్తంగా పని చేయబోతున్నాయి. ఈ మేరకు వాటి మధ్య గత ఫిబ్రవరిలో ఎంవోయూ కుదిరినట్లు మంత్రి తెలిపారు.

# ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశంసలందుకున్న చిన్నారి రూప గాయత్రి కాండ్రేగుల

**- తన నృత్య ప్రదర్శనతో ఆహుతులను అలరించిన వైనం**



విశాఖసిటీ : గ్రేటర్ విశాఖ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన కార్పొరేటర్ అభ్యర్ధులకు అభినందనలు తెలియజేసే వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఇందులో భాగంగా నగరానికి చెందిన ప్రముఖ వైద్యాలయం లక్ష్మి గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్ కుమార్ కాండ్రేగుల, రమ్య రాజు కాండ్రేగుల కుమార్తె చిన్నారి రూపా గాయత్రీ కాండ్రేగుల నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు విజయ సాయి రెడ్డి చిన్నారి రూపా గాయత్రీ కాండ్రేగుల నృత్య ప్రదర్శనకు తన సంపూర్ణ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ చిన్నవయసులోనే రూప గాయత్రి కాండ్రేగుల నృత్యం లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోందని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని చిన్నారి రూపా గాయత్రీ కాండ్రేగుల ను తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com